WANTED
స్టాఫ్ రిపోర్టర్లు & విలేకర్లు కావలెను
చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలు ప్రధాన కేంద్రంగా వెలువడుతున్న
స్వర్ణసాగరం దినపత్రికలో
పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు
జిల్లా కేంద్రాలలో స్టాఫ్ & రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణాలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం, అర్హతను భట్టి ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి : 94403 52036,9949329705



మా కలం - సామాన్యుడి బలం

# స్వర్ణసాగరం

www.swarnasagaram.in జాతీయ తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ | సంపుటి : 6 | సంచిక : 176 | పేజీలు : 8 | ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్ | బుధవారం 18 జూన్ 2025 | వెల : 2-00




# ప్లాస్టిక్ రహితంగా నగరాలు

- అక్టోబరు 2కల్లా ప్రధాన నగరాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను కట్టడి చేయాలి
- 2 నెలల్లో సర్క్యులర్ ఎకానమీపై కొత్త పాలసీ
- ఏడాదిలోగా 3 సర్క్యులర్ ఎకానమీ పార్కులు
- వ్యర్థాల నిర్వహణలో ప్రతిభకు స్వచ్ఛత అవార్డులు
- పేరుకున్న చెత్తను వెంటనే తొలగించాలి: సీఎం

**స్వర్ణసాగరం అమరావతి**

ఈఏడాది అక్టోబరు 2కల్లా విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, రాజమండ్రి నగరాలతో పాటు మరో 17 కార్పొరేషన్లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పూర్తిగా అరికట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈనగరాల్లో క్లాత్ బ్యాగుల వినియోగాన్ని పెంచాలని చెప్పారు. అలాగే 87 పట్టణ ప్రాంతాల్లో 157 రెడ్యూస-రీయూజ్-రీసైకిల్ సెంటర్లు ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. మంగళవారం సచివాలయంలో సర్క్యులర్ ఎకానమీపై అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను పటిష్ఠ పరిచేలా రెండు నెలల్లో సర్క్యులర్ ఎకానమీపై తుది పాలసీని తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. మొదటగా మూడు ప్రాంతాల్లో సర్క్యులర్ ఎకానమీ పార్కులను ఏడాదిలోగా ఏర్పాటు చేయాలన్నారు. అలాగే వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లలో ఆధునిక యంత్రాల వినియోగాన్ని పెంచాలని సూచించారు. రాష్ట్రంలో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని స్పష్టం చేశారు. 90 రోజుల్లోగా రీసైక్లింగ్, చెత్తను వేరు చేయడంపై కార్యాచరణ ప్రణాళిక ఇవ్వాలన్నారు. వ్యర్థాల నుంచి సంపద సృష్టి, వనరుల పునర్వియోగంపై ప్రధానంగా చర్చించారు. సర్క్యులర్ ఎకానమీ పార్కులు ఏర్పాటుపై మెటీరియల్ రీసైక్లింగ్ అసోషియేషన్ ఆఫ్ ఇండియా ప్రతిపాదనలను పరిశీలించారు. మొదటి దశలో భాగంగా విశాఖపట్నంలో 400 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న సర్క్యులర్ ఎకానమీ పార్కును అంతర్జాతీయ స్థాయిలో నిర్మించాలని, ఇందుకోసం వివిధ దేశాల్లోని పార్కులను పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. వీటితో భారీగా పెట్టుబడులు వచ్చేలా చూడాలని చెప్పారు.

**11 రంగాలు, 3 శాఖలపై దృష్టి**

సర్క్యులర్ ఎకానమీ కింద కేంద్రప్రభుత్వం గుర్తించిన మున్సిపల్, వాహనాలు, లిథియం బ్యాటరీలు, జిప్సం, టైర్లు, రబ్బర్, ఎలక్ట్రానిక్, వ్యవసాయం, పారిశ్రామిక, ఆక్వా వ్యర్థాలు వంటి 11 రంగాలపై దృష్టి పెట్టాలని సీఎం చెప్పారు. దీంతో పాటు అదనంగా గనులు, చేనేత, పశు సంవర్ధక శాఖలతో కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. వ్యర్థాల నిర్వహణలో అత్యుత్తమ ప్రదర్శన కనబరచిన వారికి ప్రోత్సాహకంగా స్వచ్ఛత అవార్డులను వచ్చే ఏడాది అక్టోబరు 2 నుంచి ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. స్థానిక సంస్థలు, స్వయం సహాయక సంఘాలు, అంగన్‌వాడీలు, పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్లు, ఆసుపత్రులు, ఎన్జీఓల వారీగా అవార్డులు ఇవ్వాలని నిర్దేశించారు.

**రాష్ట్రంలో 52 వ్యర్థాల క్లస్టర్లు**

జిల్లాకు రెండు చొప్పున రాష్ట్రంలోని పట్టణాలు, పంచాయతీ ప్రాంతాల్లో మొత్తం 52 వ్యర్థాల క్లస్టర్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వ్యర్థాల్లో ఎక్కువగా వ్యవసాయరంగం నుంచి 40 లక్షల మెట్రిక్ టన్నులు, పశువులు-ఆక్వా-పౌల్ట్రీ రంగాల 347 లక్షల మెట్రిక్ టన్నులు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిరోజు 88 లక్షల గృహాల నుంచి 1,329 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు వస్తున్నాయని తెలిపారు. రాజస్థాన్, కర్ణాటక, మహారాష్ట్రలో సర్క్యులర్ ఎకానమీ కోసం అందిస్తున్న ప్రోత్సాహకాల వివరాలను అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

**ప్రత్యక్షంగా లక్ష ఉద్యోగాలు..**

రాష్ట్రంలో సర్క్యులర్ ఎకానమీ సమర్థంగా అమలు చేయగలిగితే జీఎస్డీపీకి ఏడాదికి రూ. 15 వేల కోట్లు జత చేరుతుందని అంచనా. అలాగే మరో రూ. 10 వేల కోట్ల విలువైన మెటీరియల్‌ను ఉత్పత్తి రంగానికి సరఫరా చేసే అవకాశం ఉంటుంది. ఈ విలువ జోడింపుతో రాష్ట్రం జీఎస్టీ రూపంలో రూ. 3 వేల కోట్ల ప్రతి ఏటా ఆర్జించవచ్చు. మరో వైపు ప్రత్యక్షంగా లక్ష మందికి ఉద్యోగావకాశాలు దక్కనున్నాయి. 10 వేల మైక్రో ఎంటర్‌ప్రెన్యూర్‌లకు ఉపాధి లభిస్తుంది. దీంతో పాటు పరోక్షంగా 10 లక్షల మందికి ఉపాధి కలుగుతుంది. దీనికి తోడు పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుంది. కర్బన ఉద్గారాలు తగ్గుతాయి. భూ, జల, వాయు కాలుష్యాన్ని గణనీయంగా అరికట్టవచ్చు.



## నా రాజీనామా కోరే నైతిక హక్కు మీకు లేదు

- బీజేపీపై కర్ణాటక సీఎం ఫైర్
- మహాకుంభమేళా తొక్కిసలాటలో 30 మంది మరణించారని, అందుకు బాధ్యత వహిస్తూ అక్కడి సీఎం రాజీనామా చేశారా..?
- అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో 241 మంది ప్రాణాలు కోల్పోయారని అందుకు బాధ్యత వహిస్తూ ఎవరు రాజీనామా చేశారు

# చెవిరెడ్డి అరెస్టు

- విదేశాలకు పారిపోతుండగా అదుపులోకి
- లిక్కర్ స్కామ్ కేసులో మరో కీలక పరిణామం
- బెంగళూరు ఎయిర్‌పోర్టులో నాటకీయంగా అరెస్టు
- జగన్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడు
- కేసులో 38వ నిందితునిగా చేర్చిన సిట్
- దేశం దాటిపోయేందుకు ప్రయత్నం
- బినామీ వెంకటేశ్‌నాయుడితో కలిసి పథకం!
- శ్రీలంక వెళ్లేందుకు బెంగళూరు ఎయిర్‌పోర్టుకు
- అప్పటికే లుకౌట్ నోటీసులిచ్చిన సిట్
- వారిద్దరినీ అరెస్టుచేసిన ఇమ్మిగ్రేషన్ అధికారులు
- వారి సాయంతో అదుపులోకి తీసుకున్న సిట్
- నేడు విజయవాడ ఏసీబీ కోర్టుకు..



**స్వర్ణసాగరం అమరావతి**

రూ.వేల కోట్ల మద్యం కుంభకోణంలో మరో కీలక సూత్రధారి, మాజీ సీఎం జగన్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడు, వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని సిట్ అధికారులు అరెస్టు చేశారు. విదేశాలకు పరారవుతుండగా చెవిరెడ్డిని అత్యంత నాటకీయంగా బెంగళూరు విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విజయవాడకు తరలించారు. బుధవారం ఏసీబీ కోర్టులో వైసీపీ నేతను ప్రవేశపెట్టనున్నారు. లిక్కర్ కేసు దర్యాప్తులో భాగంగా ఒక్కొక్క అనుమానితుడిని పిలిచి సిట్ అధికారులు విచారించడంతో మద్యం ముడుపులతో చెవిరెడ్డికి ఉన్న లింకులు బయటికొచ్చాయి. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని కేసులో 38వ నిందితునిగా చేర్చారు. దీంతో అరెస్టు తప్పదని భావించిన ఆయన, హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారి అయిన తన వెంకటేశ్‌నాయుడుతో కలిసి పక్కా పథకం రచించారు. ఇద్దరూ విదేశాలకు పరారయ్యేందుకు సిద్ధమయ్యారు.. - మిగతా3లో




## భాషల ఆధారంగా దేశాన్ని విభజించలేం

- భారత్ ఆకాంక్షలతో కూడుకున్న దేశం
- భాషల ఆధారంగా విభజన జరగడం సరికాదు
- ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్
- దేశ భవిష్యత్తులను దృష్టిలో పెట్టుకుని, భాషా వివాదం నుంచి బయటపడాలి

## పునర్విభజనకు లైన్ క్లియర్!

**ఏపీలో 225 నియోజకవర్గాలు**

**తెలంగాణలో 119 నుంచి 134కు పెంపు**




**స్వర్ణసాగరం అమరావతి**

ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్థానాలు 175 నుంచి 225కు.. తెలంగాణ శాసనసభ స్థానాలు 119 నుంచి 134కు పెంపునకు మార్గం సుగమమైంది. దేశంలో జన గణన - మిగతా3లో

## ఇరాన్ అణుకార్యక్రమం.. 'నిజమైన ముగింపే' కావాలి

- కాల్పుల విరమణ కాదు.. ట్రంప్ రియల్ ఎండ్ వ్యాఖ్యలు
- "ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందానికి కృషి చేస్తానని నేను చెప్పలేదు.
- దీనికి కచ్చితంగా ఓ నిజమైన ముగింపు ఉండాలి
- ఇరాన్ పూర్తిగా విరమించుకునేలా ఉండాలి"





## ఇరాన్ బ్యాంకింగ్ వ్యవస్థపైనా ఇజ్రాయెల్ దెబ్బ!

- ఇరాన్ అణు స్థావరాలపై క్షిపణుల వర్షం
- ఆ దేశంలోని బ్యాంకింగ్ వ్యవస్థను కూడా దెబ్బ తీసేందుకు ప్రయత్నిస్తోంది
- ఇరాన్‌లో అతిపెద్ద బ్యాంక్ సెఫా బ్యాంక్‌పై ఇజ్రాయెల్ హ్యాకర్లు సైబర్ దాడికి పాల్పడినట్లు అక్కడి మీడియా వెబ్‌సైట్లలో కథనాలు

# మహిళపై పచ్చ సైకోల అరాచకం



- కుప్పంలో మహిళను చెట్టుకు కట్టేసిన ఘటనపై వైఎస్ జగన్ ఫైర్
- రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు ఇది నిదర్శనం
- 'మీ పాలనలో మహిళలకు లభిస్తున్న ఆత్మగౌరవం ఇదేనా?.


**స్వర్ణసాగరం తాడేపల్లి**

చంద్రబాబు సొంత నియోజకవర్గంలో మహిళపై పచ్చ సైకోల అరాచకంపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మండిపడ్డారు. చంద్రబాబు.. రాష్ట్రంలో మహిళలకు మీరు కల్పిస్తున్న రక్షణ ఇదేనా? అంటూ ప్రశ్నించారు. కుప్పంలో మహిళను చెట్టుకు కట్టేసిన ఘటనపై వైఎస్ జగన్ ఎక్స్ వేదికగా స్పందించారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు ఇది నిదర్శనం అంటూ ధ్వజమెత్తారు.. 'మీ పాలనలో మహిళలకు లభిస్తున్న ఆత్మగౌరవం ఇదేనా?. సాక్షాత్తూ మీరు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గం నారాయణపురం గ్రామంలో ఒక మహిళను చెట్టుకు కట్టేసి, హింసిస్తున్న ఘటన, మీ దుర్మార్గపు పరిపాలన ఫలితమే. తిమ్మరాయప్ప అనే కూలీ అప్పు చెల్లించలేదనే కారణంతో అతని భార్య శిరీషను మీ పార్టీ కార్యకర్త చెట్టుకు కట్టేసి, హింసించాడు. ఆమె బిడ్డలు రోదిస్తున్నా సరే కనికరం చూపలేదు, విడిచిపెట్టలేదు. చంద్రబాబు.., మీ హయాంలో జరిగిన అనేక క్రూరమైన ఘటనల్లో ఇదొకటి. పొలిటికల్ గవర్నెన్స్, - మిగతా3లో

స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక



# ఇరాన్‌లో ఏదో జరగబోతోంది.. సిట్యుయేషన్ రూమ్‌కు ట్రంప్!



**ఇంటర్నెట్‌డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హడావుడిగా జీ7 వేదికను వీడి అమెరికాకు తిరుగు ప్రయాణం కావడంతో.. సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. టెహ్రాన్ గగనతలాన్ని పూర్తిగా ఆధీనంలోకి తీసుకొన్నామని ఇజ్రాయెల్ ప్రకటించిన వేళ.. ఈ పరిణామాలు చోటుచేసుకొన్నాయి. ఆ నగరాన్ని ప్రజలు ఖాళీ చేసి వెళ్లిపోవాలని ట్రంప్ స్వయంగా హెచ్చరికలు జారీ చేయడం దీనికి ఆజ్యం పోసినట్లైంది. ఇరాన్‌లోని అణుకేంద్రాలు పెద్దగా దెబ్బతినలేదని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ అధిపతి రఫాలే గ్రూసీ వెల్లడించారు. శుక్రవారం చేసిన దాడులు మినహా మిగిలినవి పెద్దగా వీటిపై ప్రభావం చూపలేదని అభిప్రాయపడ్డారు. నతాంజ్‌లోని భూగర్భ అణుశుద్ధి కేంద్రంపై పెద్దగా వీటి ప్రభావం లేదని పేర్కొన్నారు. విద్యుత్తు సరఫరా అంతరాయాలు వంటివి చోటుచేసుకొని అక్కడి మొత్తం 15,000 సెంట్రిఫ్యూజ్‌లు దెబ్బతిని ఉండొచ్చన్నారు. అంతేకానీ ఇవి ధ్వంసమై ఉంటాయని తాము అనుకోవటం లేదని వెల్లడించారు. నతాంజ్, ఫార్డో అణు కేంద్రాలను భూగర్భంలో లోతుగా నిర్మించారు. వీటిని పేల్చేయాలంటే అత్యంత భారీ శ్రేణికి చెందిన జీబీయూ-57 బంకర్ బస్టర్ బాంబులు అవసరం. అవి అమెరికా వద్ద మాత్రమే ఉన్నాయి.

**ఫార్డోను ధ్వంసం చేయడం.. అమెరికాకు అత్యంత కీలకం**

ఇరాన్‌లోని ఫార్డో అణుకేంద్రంలో యురేనియంను 60 శాతానికి పైగా శుద్ధి చేయగలరు. ఇది అణుబాంబులు తయారీ చేయడానికి అవసరమైన దానికి చాలా సమీపంలో ఉన్నట్లే లెక్క. 2023లో అంతర్జాతీయ అణుశక్తి సంస్థ ఈ కేంద్రంలో 83.7శాతం శుద్ధి చేసిన యురేనియంను గుర్తించింది. అణుబాంబుకు అవసరమైన 90 శాతానికి ఇది చాలా దగ్గరగా ఉంది. ఫార్డో కేంద్రాన్ని ఓ పర్వతం లోపల సొరంగాల్లో నిర్మించారు. ఇక్కడ 3,000 సెంట్రిఫ్యూజులు ఉన్నట్లు అంచనా. దీనిని సాధారణ బాంబులు ధ్వంసం చేయలేవు. ఇరాన్ నుంచి అణుబాంబు తయారీని దూరం చేయాలంటే దీనిని ధ్వంసం చేయడం అమెరికా, ఇజ్రాయెల్‌కు చాలా ముఖ్యం.

**అణుకేంద్రాలపై దాడి..?**

ట్రంప్ హడావుడిగా సిట్యుయేషన్ రూమ్‌ను సిద్ధం చేయించి.. వాషింగ్టన్‌కు తిరిగి రానుండటంతో.. అమెరికా కూడా ఇరాన్ అణుకేంద్రాలను ధ్వంసం చేయడంలో ఇజ్రాయెల్‌తో చేతులు కలపనుందనే ప్రచారం జోరందుకుంది. ఇందుకోసం దాదాపు 20 అడుగుల పొడవుండే జీబీయూ-57 అనే భారీ బంకర్ బస్టర్ బాంబును వాడాల్సిందే. ఇది సుమారు 13,600 కిలోల బరువు ఉంటుంది. దీనిని కేవలం అమెరికాకు తురుపు ముక్క అయిన బి-2 స్పిరిట్ బాంబర్లు మాత్రమే ప్రయోగించగలవు. కొన్ని నెలల క్రితమే ఈ రకానికి చెందిన దాదాపు 5 యుద్ధ విమానాలను పశ్చిమాసియా సమీపంలోని డియగో గార్సియా బేస్‌కు చేర్చింది. దీనికితోడు రీఫ్యూయలింగ్ ట్యాంకర్లు, ఇతర యుద్ధ విమానాలు, ఆయుధాలను అమెరికా పశ్చిమాసియాకు తరలిస్తోంది. ఆ దేశ విమాన వాహక నౌక యూఎస్ఎస్ నిమిట్జ్ కూడా ఇప్పటికే ఈ దిశగా బయల్దేరింది. ఓ పోర్టు విజిట్‌ను కూడా రద్దు చేసుకొని ఇది పశ్చిమాసియాకు ప్రయాణం కట్టడం గమనార్హం. దీంతోపాటు డెస్ట్రాయర్లు ఇతర సహాయక నౌకలూ వస్తున్నాయి. బ్రిటన్ కూడా తన ఫైటర్‌జెట్లను మోహరిస్తుండటం టెన్షన్ పెంచుతోంది.

అమెరికా కూడా ఇజ్రాయెల్‌తో కలిసి యుద్ధం చేస్తుందన్న ప్రచారంపై ప్రముఖ వ్యాఖ్యాత టకర్ కార్లసన్ ట్రంప్‌ను విమర్శించారు. దీనికి అమెరికా అధ్యక్షుడు తనదైనశైలిలో స్పందిస్తూ "ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండకూడదు అన్న విషయాన్ని ఎవరైనా ఆ టకర్ కార్లసన్‌కు వివరించండి" అని వెటకారంగా చెప్పడం గమనార్హం. దీంతోపాటు సోషల్ మీడియా పోస్టులో కూడా ఇరాన్‌కు అణ్వాయుధం అందదు అని ట్రంప్ తేల్చిచెప్పారు. దీంతో ఆ దేశ అణు కేంద్రాలపై అమెరికా దాడి జరపొచ్చనే ప్రచారానికి బలం చేకూరుతోంది.

**కాల్పుల విరమణ కంటే పెద్దదే..!**

మరోవైపు, ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం గురించి ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ చేసిన వ్యాఖ్యలను ట్రంప్ ఖండించారు. "నేను జీ7 సదస్సును ఎందుకు వీడుతున్నానో మేక్రాన్ తప్పుగా అర్థం చేసుకున్నారు. నేను వాషింగ్టన్ ఎందుకు వెళ్తున్నానో ఆయనకు తెలియదు. కాల్పుల విరమణ ఒప్పందం గురించి కాదు.. అంతకంటే పెద్దదే జరగబోతోంది" అని ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో పోస్ట్ పెట్టారు.

# ఇరాన్ అణుకార్యక్రమం.. 'నిజమైన ముగింపే' కావాలి

**వాషింగ్టన్:** ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య దాడులు ఉద్ధృతమైన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరుదేశాలు కాల్పుల విరమణ ఒప్పందం దిశగా ప్రయత్నాలు చేయాలని గతంలో చెప్పిన ఆయన.. తాజాగా పూర్తి భిన్నమైన వ్యాఖ్యలు చేశారు. ఆ రెండు దేశాల మధ్య కాల్పుల విరమణను తాను కోరుకోవడం లేదన్నారు. అయితే, ఇరాన్ అణు సమస్యకు 'నిజమైన ముగింపు' ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. కెనడాలో జరుగుతున్న జీ-7 శిఖరాగ్ర సమావేశం నుంచి అర్ధాంతరంగా అమెరికాకు పయనమైన ట్రంప్.. ఎయిర్ ఫోర్స్ వన్ ( అమెరికా అధ్యక్షుడి విమానం)లో విలేకరులతో మాట్లాడారు.



ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం ఐదో రోజు కొనసాగుతోంది. యుద్ధం తీవ్రతరం కావొచ్చని.. పశ్చిమాసియా నుంచి ఈ ఉద్రిక్తతలు మిగతా ప్రపంచానికి విస్తరించవచ్చనే ఊహాగానాలు జోరందుకున్నాయి. అందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వరుస ప్రకటలను, చేష్టలను, చర్యలను అన్వయించుకుంటున్నారు. అయితే.. ట్రంప్ మాత్రం ఊహకందని రీతిలో స్పందిస్తున్నారు. జీ7 సదస్సు నుంచి ఎయిర్‌ఫోర్స్ వన్‌లో బయల్దేరే ముందు తాను కాల్పుల విరమణ కోసం ప్రయత్నించడం లేదని.. అంతకు మించి ఉత్తమమైన మార్గం కోసం ప్రయత్నిస్తున్నానని మీడియా ప్రతినిధులతో అన్నారు. కాల్పుల విరమణ కాదు.. నిజమైన ముగింపు కోసం ప్రయత్నిస్తున్నాం. అది నిజమైన ముగింపుగా ఉండనుంది అని ట్రంప్ పేర్కొన్నట్లు బీబీసీ ఒక కథనం ప్రచురించింది. ఇజ్రాయెల్‌కు అమెరికా మద్దతు ప్రకటించడంపై ట్రంప్‌కు ప్రశ్న ఎదురైంది. ప్రస్తుతానికి అంతా సవ్యంగానే జరుగుతోంది. ఇరాన్ ఎట్టి పరిస్థితుల్లో అణు ఆయుధాలు కలిగి ఉండడానికి వీల్లేదు అని స్పష్టం చేశారాయన. ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతాయన్న ట్రంప్.. రాబోయే రెండు రోజుల్లో మీరే చూస్తారని, అప్పటిదాకా ఎవరూ వెనక్కి తగ్గకపోవచ్చని సీబీఎస్ జర్నలిస్టును ఉద్దేశించి వ్యాఖ్య చేశారు. ట్రంప్ వ్యాఖ్యలను బట్టి అమెరికా నుంచి దౌత్య వేత్తలను ఇరాన్‌తో చర్చలకు పంపించవచ్చని రాయిటర్స్ ఓ కథనం ఇచ్చింది. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ లేదంటే పశ్చిమాసియా దౌత్యవేత్త స్టీవ్ విట్‌కాఫ్‌లలో ఎవరో ఒకరిని పంపొచ్చని ఆ కథనం ఉటంకించింది. ఇరాన్ నుంచి ప్రపంచానికి అణు ముప్పు పొంచి ఉందని చెబుతూ.. ఆపరేషన్ రైజింగ్ లయన్ పేరిట జూన్ 13వ తేదీ నుంచి దాడులు మొదలు పెట్టింది ఇజ్రాయెల్. ప్రతిగా ఇరాన్ సైతం ఇజ్రాయెల్‌పై డ్రోన్లు, మిస్సైల్స్‌తో దాడులు జరుపుతోంది. ఇజ్రాయెల్-ఇరాన్ ఉద్రిక్తతలతో ఒకవైపు ఇరుదేశాల్లో ప్రాణ నష్టంతో పాటు మరోవైపు చమురు మార్కెట్ కుదేలు అవుతోంది. ఈ క్రమంలో.. జీ7 సదస్సును కుదించుకుని మరీ హడావిడిగా వాషింగ్టన్ బయల్దేరారు అధ్యక్షుడు ట్రంప్. అయితే కాల్పుల విరమణ కోసం ట్రంప్ ప్రతిపాదన చేశారంటూ ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ ప్రకటించగా.. కాసేపటికే అందులో వాస్తవం లేదని ట్రంప్ కొట్టిపారేశారు. జరగబోయేది మేక్రాన్‌కు తెలియదని.. అది కాల్పుల విరమణకు మించే ఉంటుందని ట్రంప్ సోషల్ ట్రూత్ వేదికగా ప్రకటించారు. న్యూక్లియర్ ఎలాంటి అణ్వాయుధాలను కలిగి ఉండడానికి వీల్లేదంటున్న ట్రంప్.. టెహ్రాన్‌ను తక్షణమే ఖాళీ చేయాలంటూ అక్కడి ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. ఈలోపు.. ఆయన సిట్యుయేషన్ రూమ్‌లో జాతీయ భద్రతా మండలితో భేటీ అవుతుండడంతో 'ఏదో జరగబోతోందంటూ' చర్చ నడుస్తోంది.

# ఇజ్రాయెల్ ఐరన్ డోమ్‌కు చిల్లు.. రంగంలోకి 'మెరుపు కవచం'

**ఇంటర్నెట్‌డెస్క్:** ఇజ్రాయెల్- ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్ర రూపం దాల్చుతున్నాయి. దాడులు, ప్రతిదాడులతో పశ్చిమాసియా భగ్గుమంటోంది. గతంలో హమాస్, హెజ్‌బొల్లా దాడులను సమర్థంగా అడ్డుకున్న ఇజ్రాయెల్ ఐరన్ డోమ్‌కు ఇరాన్ చిల్లు పెట్టింది. ఆ దేశం ప్రయోగించిన క్షిపణులు ఇజ్రాయెల్‌లోని కీలక ప్రాంతాలను ధ్వంసం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో మరో అధునాతన రక్షణ వ్యవస్థ 'మెరుపు కవచం'ను ఇజ్రాయెల్ రంగంలోకి దించింది. అసలేంటీ మెరుపు కవచం? ఇది ఎలా పని చేస్తుంది? హమాస్, హెజ్‌బొల్లా దాడులను సమర్థంగా అడ్డుకున్న ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థకు ఇరాన్ తూట్లు పొడిచింది. గతంలో ఉగ్రవాదులు ప్రయోగించిన వందలాది రాకెట్లను గాల్లోనే పేల్చేసిన ఈ వ్యవస్థ.. తాజాగా బలహీన పడినట్లు తెలుస్తోంది. టెల్ అవీవ్‌లోని ఇజ్రాయెల్ గూఢచర్య సంస్థ మొస్సాద్ ప్రధాన కార్యాలయాన్ని, ఆ దేశ మిలటరీ ఇంటెలిజెన్స్ కాంప్లెక్స్‌ల లక్ష్యంగా ఇరాన్ ప్రయోగించిన క్షిపణులను 'ఐరన్ డోమ్' అడ్డుకోలేకపోయింది. అందుకే బరాక్ మెగెన్ లేదా ' మెరుపు కవచం' అని పిలిచే సరికొత్త రక్షణ వ్యవస్థకు ఇజ్రాయెల్ పని చెప్పింది. మధ్యదరా సముద్రం తీరంలోని ఇజ్రాయెల్ జలాల్లో మోహరించింది.

**అసలేంటీ మెరుపు కవచం?**

ఇజ్రాయెల్ ముద్దుగా 'బరాక్ మెగెన్' అని పిలుచుకునే ఈ గగనతల రక్షణ వ్యవస్థకు హీబ్రూ భాషలో లైటెనింగ్ షీల్డ్ (మెరుపు కవచం) అని అర్థం. ఇది ఆ దేశ అధునాతన నేవీ రక్షణ వ్యవస్థ. బరాక్ %వీ౿% క్షిపణి రక్షణ వ్యవస్థకు సరికొత్త రూపం. డ్రోన్లు, క్రూయిజ్ క్షిపణులు, బాలిస్టిక్ క్షిపణుల దాడుల నుంచి తమ యుద్ధ నౌకలకు రక్షణ కల్పించేందుకు ఇజ్రాయెల్ ఈ వ్యవస్థను రూపొందించింది. అత్యాధునిక సార్-6 యుద్ధ నౌకలకు రక్షణగా ఈ వ్యవస్థను ప్రస్తుతం వినియోగిస్తోంది. ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ (ఐఏఐ) సంస్థ దీనిని అభివృద్ధి చేసింది.



**ఎలా పని చేస్తుంది?**

రాడార్, కమాండ్ సిస్టమ్స్ ఆదేశానుసారం ' బరాక్ మెగెన్' పని చేస్తుంది. శత్రు క్షిపణులను దూరం నుంచే గమనించి మెరుపు వేగంతో దాడి చేస్తుంది. ఒకేసారి వివిధ రకాల క్షిపణులను ప్రయోగించగలిగే స్మార్ట్ వర్టికల్ లాంచర్ సెట్ దీనికి అమరుస్తారు. స్వల్ప శ్రేణి, మధ్య శ్రేణి, సుదూర లక్ష్యాలను కూడా బరాక్ మెగెన్ ఛేదించగలదు. నౌక ఉపరితలం నుంచి ప్రయోగించేందుకు వీలుగా దీనిని అభివృద్ధి చేశారు. అంతేకాకుండా శత్రు క్షిపణులు ఏ కోణంలో వచ్చినా వాటిని ఛేదించే సత్తా 'బరాక్ మెగెన్'కు ఉంది. 360 డిగ్రీల కోణంలో.. ఒకేసారి పలు లక్ష్యాలను ఛేదించవచ్చు. అంతేకాకుండా ఒకే లాంఛర్ నుంచి అన్ని రకాల క్షిపణులను ప్రయోగించే వెసులుబాటు ఉంది.

**2022లో తొలి ప్రయోగం**

ఇజ్రాయెల్ అభివృద్ధి చేసిన ఈ రక్షణ వ్యవస్థను తొలిసారిగా నవంబర్ 2022లో పరీక్షించారు. సార్-6 యుద్ధనౌక నుంచి ఐఎన్ఎస్ మెగెన్‌ను పరీక్షించినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. ఆ తర్వాత దీనికి సంబంధించిన వీడియోను కూడా ఇజ్రాయెల్ విడుదల చేసింది. ఐఎన్ఎస్ మెగెన్ లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదించినట్లు పేర్కొంది.

**భారత్ సహకారంతో బరాక్-8**

ఇజ్రాయెల్ బరాక్ మెగెన్‌తో పాటు బరాక్-8 అనే మరో క్షిపణి రక్షణ వ్యవస్థను కూడా అభివృద్ధి చేసింది. దీని కోసం భారత్‌తో కలిసి పని చేసింది. భూమిపై నుంచి గాల్లోకి ప్రయోగించేందుకు వీలుగా బరాక్-8 రక్షణ వ్యవస్థను ఇజ్రాయెల్, భారత్‌కు చెందిన డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో) సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. ఈ రక్షణ వ్యవస్థను ఎయిర్ క్రాఫ్ట్, డ్రోన్లు, యాంటీ షిప్ మిసైల్స్, బాలిస్టిక్ క్షిపణులను అత్యంత కచ్చితత్వంతో అడ్డుకునేలా రూపొందించారు. ఇది 20 కి.మీ ఎత్తులో వస్తున్న 100కి.మీ దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. బరాక్ మెగెన్ లాగానే ఈ రక్షణ వ్యవస్థను కూడా నౌకాదళం కోసం ఇజ్రాయెల్ వినియోగిస్తోంది. యుద్ధ నౌకపై నుంచే కాకుండా నేలపై నుంచీ దీనిని వినియోగించుకోవచ్చు.

## అమర్‌నాథ్ యాత్రకు వెళ్లే మార్గాలు.. 'నో ఫ్లైయింగ్ జోన్'గా..!



**శ్రీనగర్:** మంచు లింగాన్ని దర్శించుకోవడానికి ఏటా వేల మంది యాత్రికులు అమర్‌నాథ్ యాత్రకు వెళ్తారు. ఈ ఏడాది కూడా మరికొద్ది రోజుల్లో ఈ వార్షిక యాత్ర ప్రారంభం కానుంది. అయితే, ఇటీవల పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన నేపథ్యంలో జమ్మూకశ్మీర్ ప్రభుత్వం ఈ యాత్రకు భద్రతను కట్టుదిట్టం చేసింది. ఇందులో భాగంగానే.. అమర్‌నాథ్ యాత్ర వెళ్లే అన్ని మార్గాలను 'నో ఫ్లయింగ్ జోన్ 'గా ప్రకటించింది. ఈ మేరకు జమ్మూకశ్మీర్ హోం శాఖ మంగళవారం దీనిపై ఉత్తర్వులు జారీ చేసింది. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. సాధారణంగా అమర్‌నాథ్ యాత్రకు పహల్గాం మార్గంతో పాటు బాల్తాల్ మీదుగా యాత్రికులు వెళ్తుంటారు. ఈ రెండు మార్గాలను 'నో ఫ్లయింగ్ జోన్'గా ప్రకటించారు. ఈ మార్గాల్లో జులై 1 నుంచి ఆగస్టు 10 వరకు మానవ రహిత వైమానిక వాహన వ్యవస్థలు, డ్రోన్లు, బెలూన్లు వంటివి ఎగరవేయడంపై నిషేధం విధించారు. అయితే, అత్యవసర వైద్య తరలింపు, విపత్తు నిర్వహణ, భద్రతా దళాల నిఘా వంటి సందర్భాలలో ఈ ఆంక్షలు వర్తించబోవని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీటికి సంబంధించిన పూర్తి ఎస్‌వోపీని త్వరలోనే జారీ చేస్తామని అధికారులు వెల్లడించారు. జులై 3 నుంచి అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం కానున్న సందర్భంగా సజావుగా, శాంతియుతంగా సాగడానికి ఈ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. అంతేగాక, యాత్రికులకు అదనపు రవాణా సదుపాయాలను కూడా కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

## నా రాజీనామా కోరే నైతిక హక్కు మీకు లేదు..



బీజేపీ తీరుపై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ నెల 4న చిన్నస్వామి స్టేడియంలో జరిగిన తొక్కిసలాటకు బాధ్యత వహిస్తూ కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ హోంమంత్రి పరమేశ్వర రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో ఫ్రీడమ్ పార్కులో బీజేపీ ఆందోళనకు దిగడంపై సిద్ధరామయ్య స్పందించారు. తనను రాజీనామా చేయమని డిమాండ్ చేసే నైతిక హక్కు బీజేపీకి లేదని సిద్ధరామయ్య మండిపడ్డారు. మహాకుంభమేళా తొక్కిసలాటలో 30 మంది మరణించారని, అందుకు బాధ్యత వహిస్తూ అక్కడి సీఎం రాజీనామా చేశారా..? అని ఆయన ప్రశ్నించారు. అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో 241 మంది ప్రాణాలు కోల్పోయారని అందుకు బాధ్యత వహిస్తూ ఎవరు రాజీనామా చేశారని నిలదీశారు. అంతకుముందు నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి కూలి 140 మంది మరణించారని, అందుకు బాధ్యత తీసుకుని ఎవరూ రాజీనామా చేయలేదు ఎందుకని సిద్ధరామయ్య ప్రశ్నించారు. అయినా నన్ను నేను రక్షించుకోవడానికి ఈ ఉదాహరణలు చెప్పడంలేదని, రాష్ట్రంలో ఏది జరిగినా ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం కరెక్టు కాదని అన్నారు.

## ఇరాన్ బ్యాంకింగ్ వ్యవస్థపైనా ఇజ్రాయెల్ దెబ్బ!

ఇంటర్నెట్‌డెస్క్: ఇరాన్ అణు స్థావరాలపై క్షిపణుల వర్షం కురిపిస్తున్న ఇజ్రాయెల్ ఆ దేశంలోని బ్యాంకింగ్ వ్యవస్థను కూడా దెబ్బ తీసేందుకు ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలోనే అక్కడి బ్యాంకులపై సైబర్ దాడులకు పాల్పడుతోంది. దీంతో వినియోగదారుల సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఇరాన్‌లో అతిపెద్ద బ్యాంక్ సెఫా బ్యాంక్‌పై ఇజ్రాయెల్ హ్యాకర్లు సైబర్ దాడికి పాల్పడినట్లు అక్కడి మీడియా వెబ్‌సైట్లలో కథనాలు వెలువడుతున్నాయి. ఆ బ్యాంక్ కస్టమర్లు ఏటీఎంల నుంచి నగదు తీసుకునేందుకు వీలుపడటం లేదు. ఇరాన్‌లోని పలు గ్యాస్ స్టేషన్లకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు సెఫా బ్యాంక్ ద్వారానే జరుగుతుంటాయి. దీనిపై సైబర్ దాడికి పాల్పడితే.. దాని ప్రభావం గ్యాస్ స్టేషన్ల నిర్వహణపైనా పడుతుందని అక్కడి అధికారులు చెబుతున్నారు. అప్రమత్తమైన సాంకేతిక నిపుణులు ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు అక్కడి మీడియా పేర్కొంది. మరోవైపు తాజా పరిస్థితులపై ఇరాన్ సెంట్రల్ బ్యాంక్ అధికార ప్రతినిధి స్పందించారు. బ్యాంకింగ్ సేవలకు ఎలాంటి ఇబ్బందులు లేవని, సజావుగా సాగుతున్నట్లు చెప్పారు. వినియోగదారులకు సకాలంలో సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

మరోసారి దాడులకు పాల్పడిన ఇజ్రాయెల్

ఇరాన్‌పై ఇజ్రాయెల్ చేస్తున్న వైమానిక దాడులు ఐదో రోజు కొనసాగుతున్నాయి. అణు స్థావరాలు, కీలక ప్రాంతాలే లక్ష్యంగా టెల్‌అవీవ్ మరోసారి విరుచుకుపడింది. పశ్చిమ ఇరాన్ ప్రాంతంలో ఫైటర్ జెట్లతో బాంబుల మోత మోగించింది. ఈ మేరకు ఇజ్రాయెల్ మిలటరీ వెల్లడించింది.

## భాషల ఆధారంగా దేశాన్ని విభజించలేం



**పుదుచ్చేరి:** భారత్ ఆకాంక్షలతో కూడుకున్న దేశమని, భాషల ఆధారంగా విభజన జరగడం సరికాదు అని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ తెలిపారు. దేశ భవిష్యత్తులను దృష్టిలో పెట్టుకుని, భాషా వివాదం నుంచి బయటపడాలని ఆయన ప్రజల్ని కోరారు. జాతీయ విద్యా విధానం 2020ని కచ్చితంగా అమలు చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఆ విధానం విద్యా వ్యవస్థలో గేమ్‌ఛేంజర్‌గా మారుతుందన్నారు. పాండిచ్చేరి వర్సిటీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కొందరు భాషలను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. గత దశాబ్దంలో అద్భుతమైన ప్రగతి జరిగిందని, దీని వల్ల భారత్ ఆకాంక్షల దేశంగా మారిందని ఆయన అన్నారు. భాషల ఆధారంగా ఎలా విభజిస్తారని ఆయన ప్రశ్నించారు. భాషల అంశంలో ఏ దేశం కూడా భారత్ అంత సంపన్నంగా లేవన్నారు. సంస్కృత భాషకు విశ్వవ్యాప్తంగా ప్రాముఖ్యత ఉందని, తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం, ఒడియా, మరాఠీ, పాలీ, ప్రాకృతి, బెంగాలీ, అస్సామీతో పాటు 11 క్లాసికల్ బాషలు ఉన్నట్లు చెప్పారు. పార్లమెంట్‌లో 22 భాషల్లో చర్చలు చేపట్టేందుకు సభ్యులకు అవకాశం ఉందన్నారు. మన భాషలు సమగ్రతకు నిదర్శనమని, ఐకమత్యం కోసం సనాతనం అదే బోధిస్తుందని ధన్‌ఖర్ తెలిపారు. ఆత్మ పరిశోధన చేసుకోవాలని, దానికి తగినట్లు వృద్ధి కావాలన్నారు. మన లక్ష్యాలను తెలుసుకుని, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని, భాషా వివాదం నుంచి బయటపడాలని అన్నారు. ఎన్ఈపీ పాలసీని అమలు చేయాలని రాష్ట్రాలను కోరారు. మన అబ్బాయిలు, అమ్మాయిలు ఆ లబ్ధిని పొందాలన్నారు. రాజకీయ నాయకులు ఎన్ఈపీ పాలసీకి భంగం కలిగించవద్దు అన్నారు.

# టీడీపీకి కోవర్టుగా వాసుపల్లి



**విశాఖపట్టణం :** మాజీ ఎమ్మెల్యే కదలికలు అనుమానాస్పదంగా ఉన్నాయా? ఆయన మాటలు ఇప్పుడే ఎందుకు తేడాగా వినిపిస్తున్నాయి? మామీద మీ పెత్తనం ఏంటి? ఎక్కువ చేస్తే? పార్టీ ఆఫీస్ మెట్లు కూడా ఎక్కబోమని ఎందుకు అంటున్నారు? చచ్చేదాకా వైసీపీలోనే ఉంటానని ఒకవైపు చెబుతూనే? మరోవైపు స్వరం మారుస్తున్న ఆ మాజీ ఎవరు? ఆయనకు వచ్చిన ఇబ్బంది ఏంటి? ఉత్తరాంధ్ర వైసీపీలో ఒక్కొక్కటిగా అసమ్మతి స్వరాలు పెరుగుతున్నాయా అంటే? అవును, అలాగే కనిపిస్తోందంటున్నారు పొలిటికల్ పండిట్స్. అందుకు తాజా ఉదాహరణగా? విశాఖ దక్షిణ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌ని చూపిస్తున్నారు. అంతకు ముందు సంగతి ఎలా ఉన్నా?. ఇటీవల వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ వేదికగా ఆయన అన్న మాటలు, లేవనెత్తిన ప్రశ్నలు చర్చనీయాంశం అవుతున్నాయి. ఉత్తరాంధ్ర కో ఆర్డినేటర్ వ్యవస్థ పార్టీ అధినేతకు, తమకు మధ్య అడ్డుగోడగా మారిందన్న మాటల చుట్టూ రకరకాల విశ్లేషణలు పెరుగుతున్నాయి. గతంలో ఆ పోస్ట్‌లో ఉన్న విజయసాయిరెడ్డి చర్యలవల్ల ఒక్కో నియోజకవర్గంలో కనీసం 10వేల ఓట్లు కోల్పోయామన్న రాజకీయ సూత్రీకరణను తెరపైకి తెచ్చారు వాసుపల్లి. అలాంటి వ్యవస్థ ఇప్పటికీ అవసరమా?? అన్న అభిప్రాయంతో?. ప్రస్తుత కో ఆర్డినేటర్ కన్నబాబును కోట్ చేస్తూ? మాట్లాడ్డాన్ని కాస్త తేడాగానే చూస్తున్నాయట వైసీపీ వర్గాలు. ఇప్పుడు కూడా పాత పద్ధతులనే కొనసాగిస్తామని చెబితే? పార్టీ ఆఫీసులోకి కూడా అడుగు పెట్టబోనంటూ?. తీవ్రమైన వ్యాఖ్యలే చేశారు మాజీ ఎమ్మెల్యే. దీంతో వాసుపల్లి ఆలోచన ధోరణి వైసీపీ లో విస్తృత చర్చ జరుగుతోందట. ఓవైపు కూటమి ప్రభుత్వం ఏడాది వైఫల్యాలపై పోరాటానికి సమాయత్తం అవుతున్న టైంలో?. వాసుపల్లి లాంటి వాళ్ళు పాత చేదు జ్ఞాపకాలతోనే సహవాసం చేయడం ఏంటని మాట్లాడుకుంటున్నాయట పార్టీ వర్గాలు. ఇక్కడ టీడీపీతో పోలిక తీసుకురావడం మరింత ఇబ్బంది మారిందట వైసీపీ నాయకత్వానికి. వాసుపల్లి గణేష్ రాజకీయంగా ఎదిగింది, రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచింది టీడీపీలోనే. 2014, 2019లో విశాఖ దక్షిణ స్థానం నుంచి గెలిచారాయన. ఆ సమయంలో నేరుగా చంద్రబాబుతో మాట్లాడే అవకాశం ఉండేదని?కానీ? వైసీపీ అధికారంలో ఉన్నా?ప్రతిపక్షం లో కూర్చున్నా?. నియోజకవర్గ సమస్యల గురించి పార్టీ అధ్యక్షుడు జగన్‌కు నేరుగా రిపోర్ట్ చేసే అవకాశం లేకుండా పోయిందని, అదే అతిపెద్ద సమస్య అంటున్నారట ఈ మాజీ.వాస్తవానికి 2024 ఎన్నికల ఫలితాలు మిగిలిన నియోజకర్గాలతో పోలిస్తే వాసుపల్లికి అతిపెద్ద షాక్. జనసేన పోటీ చేయడం, ప్రత్యర్థి వంశీకృష్ణ పొరుగు నియోజకవర్గం నుంచి రావడం, రెండు సార్లు గెలిచిన తన అనుభవం అన్నీ కలిసొచ్చి స్వల్ప మెజారిటీతో అయినా.. బయటపడతానని అనుకున్నారట ఆయనకానీ? ఆ అంచనాలను తల్లకిందులు చేస్తూ? ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్ 64వేలకు పైగా మెజార్టీతో గెలవడం చూసి వాసుపల్లి నిజంగానే షాకయ్యారన్నది లోకల్ వాయిస్. ఆ తర్వాతనే ఆయన పార్టీలోని అత్యంత కీలకమైన వ్యవస్థని టార్గెట్ చేస్తూ మాట్లాడటం యాధృచ్ఛికం కాకపోవచ్చని అంచనా వేస్తున్నారు విశ్లేషకులు. 2019లో టీడీపీ నుంచి గెలిచి ఏడాది కాలానికే జెండా పీకేశారు ఈ మత్స్యకార నేత. వైసీపీ అధినాయకత్వం సాదరంగా స్వాగతించినప్పటికీ నియోజకవర్గ రాజకీయాలు కంట్లో నలుసుగా మారాయట. అప్పటి వైసీపీ నేత, బ్రాహ్మణ కార్పొరే షన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ వర్సెస్ వాసుపల్లిగా వ్యవహారం నడిచేది. అప్పటి పార్టీ ముఖ్యనేత విజయ సాయిరెడ్డి ప్రమేయంతోనే తాను ఇబ్బంది పడాల్సి వచ్చిందన్న అభిప్రాయం ఆయనలో ఉందట. ఇక ఎన్నికలకు ముందు సుధాకర్ పార్టీ మారిపోయి దక్షిణ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ అయ్యారు. ఇక దక్షిణ నియోజకవర్గం వైసీపీలో తనకు ఇబ్బంది లేదనుకుంటున్న టైంలో చేసిన తాజా వ్యాఖ్యలు ఇప్పుడు పార్టీలో కలకలం రేపుతున్నాయి. ఇప్పుడు ఆయన స్వరం ఎందుకు మారిందన్న చర్చలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో అధికారం మారిన వెంటనే ఆయన తిరిగి కూటమికి దగ్గరవుతారని అనుకున్నారు అంతా. గణేష్ కుమార్ మాత్రం ప్రాణం వున్నంత వరకు వైసీపీలోనేనని తేల్చేశారు. అలాంటప్పుడు ఈ అసంతృప్త స్వరం ఎందుకంటే? అందుకు వేరే బలమైన కారణాలున్నాయన్న విశ్లేషణలు నడుస్తున్నాయి. విశాఖ దక్షిణంలో బలపడేందుకు మాజీ ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాస్ కుటుంబం ప్రయత్నం చేస్తోందట. అలాగే? ఒకరిద్దరు మాజీ ఎమ్మెల్యేలు కూడా యాక్టివేట్ అవుతున్నట్టు సమాచారం. వాళ్ళకు పార్టీలోని సీనియర్లు సహకరిస్తున్నారన్న అనుమానమే ఆయన అసహనానికి కారణం కావచ్చంటున్నారు. అందుకే కో ఆర్డినేటర్ వ్యవస్థను కూడా ప్రశ్నిస్తుండవచ్చన్నది ఓ వాదన. మొత్తం మీద వైసీపీలోని అత్యంత కీలకమైన వ్యవస్థ టార్గెట్‌గా వాసుపల్లి సంధించిన అసంతృప్తి అస్త్రం ఎన్ని మలుపులు తిరుగుతుందో చూడాలి.

# చెవిరెడ్డి అరెస్టు



-మొదటిపేజీ తరువాయి

ముందు శ్రీలంకకు వెళ్లి అటు నుంచి ఇతర దేశాలకు వెళ్లిపోయేందుకు రహస్యంగా ఏర్పాట్లు చేసుకున్నారు. ముందే ఈ విషయం పసిగట్టిన సిట్ అధికారులు చెవిరెడ్డి, వెంకటేశ్‌నాయుడులపై ఎల్‌వోసీ (లుకౌట్ నోటీసు) జారీ చేసింది. ఈ విషయం తెలియని చెవిరెడ్డి, వెంకటేశ్‌నాయుడు తమ పథకంలో భాగంగా మంగళవారం బెంగళూరు విమానాశ్రయానికి చేరుకున్నారు. ఇమ్మిగ్రేషన్ అధికారులు ఎయిర్‌పోర్టులోనే వారిద్దరినీ నిర్బంధించి ఏపీ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే సిట్ అధికారుల బృందం బెంగళూరుకు చేరుకుని ఇద్దరినీ అదుపులోకి తీసుకుంది.

**రూ.కోట్ల నగదు అభ్యర్థులకు పంపిణీ..**

గత ఎన్నికల్లో తన అభ్యర్థులను గెలిపించుకోవడానికి అప్పటి అధికార వైసీపీ మద్యం ముడుపులను వాడినట్టు సిట్ గుర్తించింది. ఎన్నికల సందర్భంగా రూ.ఎనిమిది కోట్లు ప్రకాశం జిల్లాలోని ఒక అసెంబ్లీ అభ్యర్థికి ఇచ్చేందుకు తీసుకెళ్తుండగా ఈసీ పట్టుకుంది. అప్పట్లో ఆ డబ్బులను సీజ్ చేసిన తహశీల్దారు మొదలుకొని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వాహన డ్రైవర్, గన్‌మ్యాన్, వ్యక్తిగత సహాయకుడి వరకు అందరినీ పిలిపించి సిట్ అధికారులు ప్రశ్నించారు. ఆ రూ.8 కోట్లు తనవంటూ అప్పట్లో చెవిరెడ్డి మిత్రుడు, బినామీ వెంకటేశ్ నాయుడు ఆధారాలు చూపించి వెనక్కు తీసేసుకున్నారు. అవి లిక్కర్ ముడుపులేనని తాజాగా తేలడంతో వెంకటేశ్‌నాయుడిని సిట్ విచారించింది. ఆయనను ఈ కేసులో 34వ నిందితునిగా చేర్చింది. 2024 సార్వత్రిక ఎన్నికలకు కొన్ని నెలల ముందు, కోడ్ రాష్ట్రంలో అమలులోఉండగా రాజ్ కసిరెడ్డి (ఏ1) నుంచి సుమారు రూ.285కోట్ల వరకూ పలు దఫాలుగా, పలు ప్రాంతాలనుంచి చెవిరెడ్డి తీసుకుని ఐదుచోట్ల నిల్వ చేశారని సిట్ గుర్తించింది. నోటిఫికేషన్ వెలువడిన తర్వాత పలువురు వైసీపీ అభ్యర్థులకు ఎన్నికల ఖర్చుల కోసం ఆ డబ్బులు పంచినట్లు తేలింది. ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా తన కోసమూ ఆ ముడుపులు ఖర్చుచేసిన భాస్కర్ రెడ్డి, తన కుమారుడు మోహిత్‌రెడ్డి కోసం చంద్రగిరిలోనూ వాటిని ఖర్చు చేసినట్టు సిట్ ఆధారాలు సేకరించింది. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మోహిత్ రెడ్డితోపాటు ఆరుగురిని ఇటీవల నిందితులుగా చేర్చి, కోర్టులో వారిపై మెమో దాఖలుచేసింది.

డ్రైవర్లు, చిన్న ఉద్యోగులతో నగదు తరలింపు

ఏపీ బేవరేజస్ కార్పొరేషన్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి బాలాజీ యాదవ్‌ను ఏ-35గా నిందితుల జాబితాలో చేర్చింది. అలాగే, చెవిరెడ్డి వ్యక్తిగత సహాయకుడు నవీన్ ఏ-36, ఆయన వాహన డ్రైవర్ హరీశ్ ఏ-37, చెవిరెడ్డి కుమారుడు, మోహిత్ రెడ్డిని ఏ-39గా చేర్చింది. చెవిరెడ్డికి బాలాజీ యాదవ్ అత్యంత నమ్మకస్థుడు. తుడా ఆఫీసులో ఉన్న బాలాజీని ఏపీ స్టేట్ బేవరేజస్ కార్పొరేషన్‌లోకి తెచ్చి...ఎప్పటికప్పుడు మద్యం వ్యాపార వివరాలు (ఏ1) రాజ్ కసిరెడ్డికి అందించే బాధ్యతను ఆయనకు అప్పగించింది చెవిరెడ్డేనని సమాచారం. డబ్బులు ఎవరెవరికి ఎంత, ఎక్కడ అందజేయాలనేది నవీన్‌కు చెప్పి, ఆయనతో చెవిరెడ్డి ఆ పనులు చేయించినట్టు సిట్ గుర్తించింది. పలుమార్లు డబ్బులు తీసుకొచ్చిన వాహనానికి డ్రైవర్‌గా వ్యవహరించిన హరీశ్‌ను కేసులో నిందితుడిగా చేర్చింది. లిక్కర్ ముడుపులను చంద్రగిరి ఎన్నికల్లో పంచిన మోహిత్ రెడ్డిని కూడా నిందితుల జాబితాలో చేర్చింది.

**ముడుపులు కట్టారిలా.**

వైసీపీ ప్రభుత్వంలో కీలక నేత, జగన్ దంపతుల వద్దకు ఏకంగా తిరుమల వెంకటేశ్వర స్వామినే తీసుకొచ్చేంత భక్తి చూపించిన చెవిరెడ్డికి ఆరు జిల్లాల్లో ఎన్నికల బాధ్యతను వైసీపీ అధినేత అప్పట్లో అప్పగించారు. ఎప్పటికప్పుడు ఎన్నికల సర్వేలు చేస్తూ ఎక్కడెక్కడ అభ్యర్థులు ఎలా ఉన్నారో అధ్యక్షుడికి చెవిరెడ్డి నివేదికలు ఇచ్చేవారు. జగన్ కుటుంబంతో బం?ధుత్వం కలుపుకొనే స్థాయికి వీరి బంధం చేరినట్లు ప్రచారం జరిగింది. ఈ పరిస్థితుల్లోనే తన కుమారుడు మోహిత్ రెడ్డికి చంద్రగిరి అసెంబ్లీ టికెట్‌ను ఇప్పించుకున్నారు. చెవిరెడ్డికి ఒంగోలు ఎంపీ అభ్యర్థిత్వానికి బీ ఫారమ్ జగన్ ఇచ్చారు. దీనితోపాటు పార్టీకి చెందిన పలువురు అభ్యర్థులను గెలిపించే బాధ్యతను కూడా చెవిరెడ్డికే అప్పగించారు. అందుకు అవసరమైన ధనం హైదరాబాద్‌లో తీసుకోవాలని సూచించారు. దీంతో (ఏ1) రాజ్ కసిరెడ్డి నుంచి రూ.కోట్లు అందుకుని టార్గెట్ జిల్లాల్లోని పలువురు వైసీపీ అభ్యర్థులకు చెవిరెడ్డి పంపిణీ చేసినట్లు సిట్ గుర్తించింది.

# అనవసర రాద్ధాంతంతో వైసీపీ

**విజయవాడ :** ఇంటిలో తిరుగుతున్న ఫ్యాన్‌కు బేరింగులు బాగుంటేనే దాని నుంచి నలుదిక్కులా గాలి వస్తుంది. శబ్ధం లేకుండా ఫ్యాన్ ఆహ్లాదాన్ని అందిస్తుంది. రాత్రి వేళ సుఖమయ నిద్రను అందిస్తుంది. ఫ్యాన్ లోని ఇతరత్రా పరికరాల కంటే బేరింగులే కీలక భూమిక పోషిస్తాయి. అలాంటి ఫ్యాన్ ను పట్టుకుని ఎన్నికల ప్రచారంలో వైసీపీ అదినేత, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఫ్యాన్ ఇంటిలో ఉండాలి.. టీడీపీ గుర్తు సైకిల్ ఇంటి బయట ఉండాలి, ఇక జనసేన గుర్తు గ్లాసు సింకులో ఉండాలంటూ రిథమిక్ డైలాగులు చెప్పిన విషయం గుర్తుండే ఉంటుంది. అయితే ఇప్పుడు వైసీపీ పరిస్థితి చూస్తే? ఆ పార్టీ గుర్తు ఫ్యాన్ కే బేరింగులు పూర్తిగా పాడైపోయాయని చెప్పక తప్పదు.ఇక అసలు విషయంలోకి వస్తే? జగన్ అమలు చేసిన అమ్మ ఒడి మాదిరిగానే కూటమి సర్కారు ఇటీవలే తల్లికి వందనం పేరిట కార్యక్రమాన్ని ప్రారంబించింది. ఈ పథకంపై ఆది నుంచి కూడా తనదైన శైలి విమర్శలు గుప్పిస్తూ వస్తున్న వైసీపి ఎక్కడికక్కడ కూటమి పార్టీలను ప్రత్యేకించి టీడీపీని ఎద్దేవా చేసేందుకు వైసీపీ నేతలు చేయని యత్నం లేదంటే అతిశయోక్తి కాదు. ఈ విమర్శలన్నింటినీ తట్టుకుని మరీ కూటమి సర్కారు తల్లికి వందనాన్ని ఘనంగా ప్రారంభించింది. ముందుగా చెప్పినట్టుగా ఇంటిలో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తామన్న కూటమి మాట తప్పలేదు. ఫలితంగా ఒక్కో ఇంటిలో ఐదుగురు, ఆరుగురు, కొన్ని కుటుంబాల్లో అయితే ఏకంగా 12 మంది పిల్లలకూ ఈ పథకం అందింది.అయితే పథకం ప్రారంభం అయిన వెంటనే ఈ పథకం అమలు తీరుపై వైసీపీ తనదైన శైలి విమర్శలు గుప్పించడం మొదలు పెట్టింది. తల్లికి వందనం రూ.15 వేల అని చెప్పి రూ.13 వేలు మాత్రమే ఇచ్చారన్న వైసీపీ?మిగిలిన రూ.2 వేలు లోకేశ్ ట్యాక్స్ కింద లోకేశ్ ఖాతాలకు మళ్లాయని ఆరోపించింది. ఈ ఆరోపణలపై టీడీపీ చాలా వేగంగా రియాక్ట్ అయ్యింది. అమ్మ ఒడిలో మీరు కూడా రూ.2 వేలు కట్ చేశారు కదా..మరి నాడు జగన్ ఖాతాలోకి వెళ్లాయా? అని ప్రశ్నించిన టీడీపీ? లోకేశ్ ఖాతాలోకి రూ.2 వేలు చేరినట్లుగా నిరూపించాలని డిమాండ్ చేసింది. ఈ విషయంలో స్వయంగా లోకేశే రంగంలోకి దిగి డెడ్ లైన్ విధించడంతో వైసీపీ సైలెంట్ అయిపోయింది. సారీ చెప్పాలని లోకేశ్ హెచ్చరించినా ఏదో మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ మిన్నకుండిపోయింది.ఇక ఆదివారం ఉదయం నుంచి వైసీపీ ఈ పథకంలో బారీ ఎత్తున అవినీతి జరిగిందంటూ ఊదరగొట్టింది. ఒక తల్లికి 360 మంది పిల్లలు ఉన్నారని, వారందరికీ తల్లికి వందనం కింద డబ్బులు వేశారని, అలాగే చాలా మంది పేర్ల కింద 150, 100.. ఇలా ఇష్టారాజ్యంగా పిల్లల పేర్లు రాసుకుని టీడీపీ నేతలు ఈ పథకం డబ్బులను కాజేశారంటూ ప్రచారం మొదలెట్టింది. అయితే ఈ ఆరోపణలపైనా టీడీపీ మరింత వేగంగా రియాక్ట్ అయ్యింది. తల్లికి వందనం పథకాన్ని తాము అనాథ శరణాలయాల పిల్లలకూ అమలు చేస్తున్నామని చెప్పిన టీడీపీ? ఆ పెద్ద పెద్ద సంఖ్యలన్నీ రాష్ట్రంలోని ఆయా అనాథ శరణాలయాలకు చెందిన జాబితాలేనని తేల్చిచెప్పింది. అయినా ఏదో జాబితాల్లో దొరికింది కదా అని క్షేత్ర స్థాయి పరిశీలన లేకుండానే విమర్శలు చేస్తే ఇలానే ఉంటుంది మరీ.

## జాతీయ స్థాయికి మించి పెరిగిన ఏపీ తలసరి ఆదాయం

-మొదటిపేజీ తరువాయి

స్వయం సమృద్ధి సాధించాలంటే ఏం చేయాలనే అంశంపై డేటా అనలిటిక్స్ చేయాలని సూచించారు. సేవల రంగం అభివృద్ధి జరిగేలా దృష్టి పెడితే ఆర్థిక సుస్థిరతను సాధించగలమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గ్రామస్థాయిలో కూడా కీ-పెర్ఫామెన్స్ ఇండికేటర్లు పెడితే.. క్షేత్రస్థాయిలో పోటీతత్వం పెరుగుతోందని సీఎం చంద్రబాబు చెప్పారు. 15 శాతం వృద్ధి లక్ష్యంగా ప్రణాళికలు చేయడంతో పాటు.. పనితీరును మెరుగుపరుచుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు.

**స్వర్ణ ఆంధ్ర విజన్ చర్చ**

స్వర్ణ ఆంధ్ర విజన్ ఏ2047ని పకడ్బందీగా అమలు చేయడం కోసం సీఎం చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారు. నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ అమలు కోసం యంగ్ ప్రొఫెషనల్స్‌ను నియమించాలని సీఎం నిర్ణయించారు. 48 నెలల పాటు పనిచేయడానికి ప్రతి నియోజకవర్గానికి ఒక్కొక్కరి చొప్పున యంగ్ ప్రొఫెషనల్స్‌ని నియమించాలని అధికారులకు సూచించారు. ఏపీవ్యాప్తంగా 175 మంది యంగ్ ప్రొఫెషనల్స్ నియామకానికి అనుమతిస్తూ సీఎం చంద్రబాబు ఆదేశాలిచ్చారు.

**ఏపీలో ఇకపై ప్లాస్టిక్ రహిత నగరాలు: సీఎం చంద్రబాబు**

అలాగే.. సర్క్యులర్ ఎకనామి సమీక్షలో సీఎం చంద్రబాబు అధికారులతో చర్చించారు. ఏపీలో ఇకపై ప్లాస్టిక్ రహిత నగరాలు ఉండాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ ఏడాది అక్టోబర్ 2వ తేదీ లోగా ఏపీలోని విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, రాజమండ్రి, 4 ప్రధాన నగరాలతో పాటు మరో 17 కార్పొరేషన్లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని పూర్తిగా అరికట్టాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఈ నగరాల్లో క్లాత్ బ్యాగ్స్ వినియోగం పెంచాలని సూచించారు. అలాగే 87 పట్టణ ప్రాంతాల్లో 157 రెడ్యూస్-రీయూజ్-రీసైకిల్ సెంటర్లు ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు.

## పునర్విభజనకు లైన్ క్లియర్!

-మొదటిపేజీ తరువాయి

చేపట్టడానికి అనుమతిస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. జనగణన వచ్చే ఏడాది పూర్తి కానుంది. కొత్త జనాభా లెక్కల ఆధారంగా దేశ వ్యాప్తంగా లోక్ సభ, శాసనసభ స్థానాల పునర్వి భజన ప్రక్రియను ఎన్నికల సంఘం చేపట్టనుంది. రాజ్యాంగంలోని 170వ అధికర ణలోని సెక్షన్-15 ప్రకారం శాసనసభ స్థానాలను ఆంధ్ర ప్రదేశ్లో 175 నుంచి 225కు, తెలంగాణలో 119 నుంచి 134కు పెంచుతూ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టా లని విభజన. చట్టం-2014లో సెక్షన్-26(1) ద్వారా ఎన్నికల సంఘానికి కేంద్రం నిర్దేశించింది.

## మహిళపై పచ్చ సైకోల అరాచకం

-మొదటిపేజీ తరువాయి

రెడ్‌బుక్ పేరిట మీరు నెలకొల్పిన దుష్ట సంప్రదాయంలో భాగంగా మీరు, మీ పార్టీ నాయకులు రాష్ట్రవ్యాప్తంగా చెలరేగిపోయి చేస్తున్న దుర్మార్గాలకు మహిళలు, యువతులు, బాలికలు ఇలా ఎందరో బలైపోతున్నారు. ఈ ఘటనతోపాటు, ఏడాదికాలంలో రాష్ట్రవ్యాప్తంగా మహిళలపై జరిగిన అన్యాయాలు, అఘాయిత్యాలను సీరియస్‌గా తీసుకోవాలని, చట్టప్రకారం కఠిన చర్యలు చేపట్టాలి’ అని వైఎస్ జగన్ డిమాండ్ చేశారు.

## ఏడాది సంబురాల్లో కనిపించని కమలం

-మొదటిపేజీ తరువాయి

ఒక్కరంటే ఒక్కరు కూడా స్పందించలేదు. దీనివల్ల అనేకమంది మహిళలకు లబ్ధి జరుగుతోందని ఒక ప్రెస్ మీట్ గాని ఒక ప్రకటన గాని విడుదల చేయలేదు.అలాగే పింఛన్ల పెంపు, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి వాటిపై కూటమి పాలకులు ఒకవైపు ప్రకటనలు చేస్తున్న బిజెపి పక్షాన ఎవరు నోరు ఎత్తటం లేదు. మరి దీన్ని ఎలా చూడాలి? ఏ విధంగా అర్థం చేసుకోవాలి అంటే రేపు ఏదైనా ప్రజల్లో అసంతృప్తి రగిలి అసంతృప్తి కారణంగా విమర్శలు చేస్తే మా తప్పులేదు అని తప్పించుకునే దారి బిజెపిలో కనిపిస్తోందా? లేకపోతే రేపు రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేస్తే దానికి మాకు సంబంధం లేదు మేము నిమిత్త మాత్రులం అని తప్పించుకునే దారి కనిపిస్తోందా అంటే అవునని అంటున్నారు పరిశీలకులు.కూటమి ప్రభుత్వంలో ఏం చేసినా అది మూడు పార్టీలకు వర్తిస్తుంది. రేపు ఓట్లు అడిగే విధానాన్ని పరిశీలిస్తే మూడు పార్టీల పరంగానే ప్రజల్లోకి వెళ్లాలి. మూడు పార్టీల పరంగానే ప్రజలను ఓట్లు అభ్యర్థించాలి. ఈ విషయంలో బిజెపి నాయకులు అనుసరిస్తున్న ధోరణి ప్రధానంగా చర్చగా మారింది. ఇది సరికాదని ప్రజల్లోకి రావాలనేది కూటమి పార్టీలకు చెందిన సీనియర్ నాయకులు సూచిస్తున్నారు. నిజానికి గత ఎన్నికల్లో విజయం ఎలా ఉన్నా వచ్చే ఎన్నికల నాటికి ఈ ఐదేళ్ల పాలనను చూసి మాత్రమే ప్రజలు ఓటేస్తారు తప్ప జగన్ పై విమర్శలు చేయడం ద్వారా ఓట్లు ఎంతవరకు పడతాయి అనేది చూడాలి.కాబట్టి మళ్ళీ ఎన్నికల్లో విజయం దక్కించుకోవాలన్నా.. మళ్లీ ఎన్నికల్లో మెజారిటీ ఓట్లు సాధించాలన్నా కూడా అందరూ కలిసికట్టుగా సంయుక్తంగా ప్రజల మధ్య ఉండడం ప్రజల సమస్యలు పట్టించుకోవడం ముఖ్యం. సంతృప్తిని కూడా అంచనా వేసుకోవడం వంటివి బిజెపి నాయకులు కూడా చేయాల్సిన అవసరం ఉందనేది పరిశీలకులు చెబుతున్న మాట. మరి కమల నాథులు ఏమంటారో చూడాలి.

## ఇప్పుడు కాకపోతే ఎప్పుడంటున్న జనసేన ఎమ్మెల్యేలు

**ఏలూరు :** 24 అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో తిరుగులేని ఆధిపత్యాన్ని చూపించింది జనసేన. జిల్లాలోని ఆరు సీట్లలో పోటీ చేసి అన్ని చోట్ల విజయం సాధించి కంచుకోటగా నిలబడింది. అలాంటి జిల్లాలో పార్టీ అధినేత ఆశించిందొకటి.. ఎమ్మెల్యేలు చేస్తున్నదొకటి అన్నట్టుగా తయారైందట పరిస్థితి. ఇక్కడి నుంచి తొలిసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన జనసేన నేతలు.. మళ్ళీ అవకాశం వస్తుందో లేదో? భవిష్యత్తు సంగతి మనకెందుకు, దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకుందామన్నట్టు ఆత్రంగా వ్యవహరిస్తున్నారట. గీత దాటుతూ? ఇప్పుడు కాకుంటే ఇంకెపుడు అన్నట్టుగా చేస్తున్న పనులు చూసి జనసేన నేతలే అవాక్కవుతున్నట్టు చెప్పుకుంటున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి తొలిసారి అసెంబ్లీకి వెళ్ళిన వారిలో నర్సాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఉంగుటూరు శాసనసభ్యుడు పత్సమట్ల ధర్మరాజు ఉన్నారు. ఇక సీనియర్ నాయకుల లిస్టులో భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, నిడదవోలు ఎమ్మెల్యే కమ్ మంత్రి కందుల దుర్గేష్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఉన్నారు.సీనియర్ల సంగతి పక్కనపెడితే పోలవరం, నర్సాపురం, ఉంగుటూరు ఎమ్మెల్యేల అనుచరులు మాత్రం దున్నేస్తున్నారన్న టాక్ ఉంది జిల్లాలో. ఏ పనిచేయాలన్నా, ఏ కాంట్రాక్ట్ దక్కించుకోవాలన్నా, మద్యం వ్యాపారం చేయాలన్నా? షాడోలుగా మారిన ఎమ్మెల్యేల అనుచరగణానికి భారీగా ముడుపులు చెల్లించుకోవాల్సి వస్తున్నట్టు చెప్పుకుంటున్నారు. మంచా చెడా అన్నదాంతో సంబంధం లేదు. పని ఏదైనా సరే?? ఫిక్స్ చేసిన పర్సంటేజ్ ముట్టజెపితే చాలు?. పూర్తి స్థాయిలో సహకరిస్తారట. ఆయా నియోజకవర్గాల్లో ఇది ఓపెన్ టాక్ అంటున్నారు. నరసాపురంలో ఓఎం బొమ్మిడి నాయకర్ సోదరుడితో సహా మరికొంత మంది నేతలు ప్రతి పనికీ? ఓ రేటు ఫిక్స్ చేస్తున్నారన్న ఆరోపణలు గట్టిగానే వినిపిస్తున్నాయి. ఇటీవల సివిల్ తగాదాల్లో సైతం ఎమ్మెల్యే మనుషులు తలదూర్చి సెటిల్మెంట్స్ చేయడం వివాదాస్పదమవుతున్నట్టు చెబుతున్నారు. నరసాపురం నియోజకవర్గంలో ఏ వ్యాపారం మొదలుపెట్టాలన్నా? ముందు నాయకర్‌కు కావాల్సిన వాళ్ళని కలిస్తేనే? పనవుతుందని, వాళ్ళకు సమర్పించుకోకుంటే? ఏ పనీ చేయలేరన్న ప్రచారం జోరుగా ఉంది. మట్టి తవ్వకాల విషయంలో జనసేన నేతల ఆగడాలపై? మిత్రపక్షం టీడీపీ నాయకులే ఫిర్యాదు చేసేవరకు వెళ్ళిందంటే? పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నది లోకల్ వాయిస్. ప్రభుత్వ భూముల్లో అక్రమ తవ్వకాలు, తమ సామాజికవర్గానికి చెందిన వారితో సెటిల్మెంట్స్‌లాంటి ఆరోపణలు పెరుగుతున్నాయి. తొలిసారి ఎమ్మెల్యే అయిన నాయకర్ సలహాదారులు, సెటిల్మెంట్ చేసే బ్యాచ్‌తో పెద్ద కోటరీనే ఏర్పాటు చేసుకున్నారని జనసేన నేతలే గుసగుసలాడుకుంటున్నారట. ఇక పోలవరం విషయంలోనూ ఇదే పరిస్థితి.ఎమ్మెల్యే మనుషులమంటూ కొంతమంది అక్రమాలకు తెరలేపడంతో నియోజకవర్గంలో చులకన భావం ఏర్పడుతోందని తెగమధన పడిపోతున్నారట తెలుగు తమ్ముళ్ళు. జనసేన ఎమ్మెల్యే పనులు తమకు తలవంపులు తెస్తున్నాయన్నది వాళ్ళ వాదనగా తెలుస్తోంది. మొత్తం ఏడు మండలాల్లో ఎమ్మెల్యే షాడోస్‌ని పెట్టుకుని బీభత్సంగా వసూళ్ళకు పాల్పడుతున్నారన్న

తిరుపతి

చిత్తూరు నెల్లూరు అనంతపురం

విలేకరులు కావలెను

సంప్రదించండి : 9440352036

# సూపర్ సిక్స్ హామీలన్నీ బూటకం

**ఏడాది పాలనలో రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో అరాచకం**

**పల్లె పల్లెలో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు**

**జగన్ అంటే నమ్మకం చంద్రబాబు అంటే మోసం పుస్తకం ఆవిష్కరణ**

**మండల పార్టీ కన్వీనర్ పాదర్తి హరనాథ్ రెడ్డి, ఎంపీపీ గడ్డం అరుణ రెడ్డి**



స్వర్ణ సాగరం ఓజిలి, జూన్ 17:

కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పచ్చి అబద్ధాలను చెబుతూ ప్రజలను నిలువునా మోసం చేసిందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ పాదర్తి హరనాథ్ రెడ్డి, ఎంపీపీ గడ్డం అరుణ రెడ్డి లు అన్నారు. ఓజిలి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అవినీతి, అక్రమాలకు తావివ్వకుండా డీబీడీ, నాన్ డీబీటీ ద్వారా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాది పాలనలో పింఛన్లు తప్ప ఏది సక్రమంగా ఇవ్వలేదన్నారు. తల్లికి వందనం పేరుతో ప్రజలను వంచిస్తూ రాష్ట్రంలో 67 లక్షల మంది అర్హులుగా ఉంటే 37.70 లక్షల మందికి మాత్రమే లబ్ధి చేకూర్చడం జరిగిందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు పాలన చేతకాక అబద్ధాలు చెబుతూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగి మహిళలపై అఘాయిత్యాలు, బాలికలపై వేధింపులు అధికమైయ్యాయని తెలియజేశారు. విద్య, వైద్యం, వ్యవసాయం కొందరికి అమలు చేస్తూ రాష్ట్రంలో ఉన్మాద రాజకీయాలకు తెరలేపారని వారు మండిపడ్డారు. ఎన్నికల సమయంలో మందుబాబులకు నాణ్యమైన మద్యంను తక్కువ రేట్లకే విక్రయిస్తానని చంద్రబాబు నాయుడు కల్లబొల్లి మాటలు చెప్పి, అధికారంలోకి రాగానే పల్లె పల్లెలో మద్యం బెల్ట్ షాపులను ఏర్పాటు చేసి గ్రామాల్లో విచ్చలవిడిగా మద్య ంను విక్రయిస్తూ పేదలను దోచుకుంటున్నారని తెలియజేశారు. గ్రామాల్లో త్రాగునీటికి కొరత ఉందేమో కానీ మద్యానికి మాత్రం ఎక్కడా లోటు లేకుండా ప్రతి గ్రామంలో లభ్యమవుతుందని తెలియజేశారు. గతంలో ఇసుక, మట్టి అక్రమ రవాణా జరుగుతుంటే వాహనాలను అడ్డుకొని అధికారులు సీజ్ చేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో దజ్జాగా రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక, మట్టి రవాణా చేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేశామని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వం అర, కొరగా లబ్ధిదారులకు సాయం చేసి చేతులు



దులుపుకుంటూ ప్రజలను మభ్య పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేసేంతవరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమును ప్రశ్నిస్తూ ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కొండూరు వెంకటసుబ్బరాజు, మాజీ మండల కన్వీనర్ దేశి రెడ్డి మధుసూదన్ రెడ్డి, వైస్ ఎంపీపీ లెక్కల ప్రసాద్ నాయుడు, ఎంపీటీసీ గుంటమడుగు రఘురామరాజు, సర్పంచులు కొండూరు ప్రభాకర్ రాజు, ఎల్లా సురేష్ రెడ్డి, సత్తు మహేందర్ రెడ్డి, నాయకులు జయరామిరెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, పిండుకూరు మసూదన్ రెడ్డి, కొండూరు దామోదర్ రాజు, మొక్కపాటి వెంకట ప్రసాద్, అరవ భూమి రాజారెడ్డి, గోపాలయ్య, కొలనుకుదురు సురేష్ రెడ్డి, పరంధామ రెడ్డి, ముమ్మడి రామయ్య, షేక్ అజమతుల్లా, వెంకటేశ్వర్లు, చిట్టేటి తిరుపాలయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులందరూ నా కుటుంబ సభ్యులే డిడి సదారావు



నెల్లూరు స్వర్ణ సాగరం జూన్ 17

నెల్లూరుజిల్లాలో గత రెండు సంవత్సరాలుగా ఐ అండ్ పిఆర్ డిప్యూటీ డైరెక్టర్ గా పనిచేసి నెల్లూరు జిల్లాలో వీడుతున్న సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ కె సదారావును ఏపీయూడబ్ల్యూజే ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఏపీడబ్ల్యూజే ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా, మరియు సామ్నా నాయకులు తదితర జర్నలిస్టులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డిడి సదారావు మాట్లాడుతూ తాను గత రెండు సంవత్సరాలుగా నెల్లూరు జిల్లాలో అన్ని విధాలుగా పాత్రికేయులకు ప్రభుత్వ అధికారులకు నాయకులకు మంచి సేవలు అందించాలని ఏదైనా సమస్య ఉందని తన దృష్టికి తీసుకువచ్చినప్పుడు అన్ని కూడా పరిష్కరించానని పెద్ద బతుకులతో పాటు స్థానిక పత్రికలకు కూడా ప్రకటనలు విషయంలోను సహకరించానని జర్నలిస్టులందరూ తన కుటుంబ సభ్యులేనని ఎక్కడికి వెళ్లినా నెల్లూరు జిల్లా జర్నలిస్టులను గుర్తుపెట్టుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి ఏ జయప్రకాష్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు రమేష్, ఏపీయూడబ్ల్యూజే నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు దయాశంకర్, నాగరాజు, కోశాధికారి హనోక్,కార్యవర్గ సభ్యులు ప్రతాప్, సామ్నా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోపీనాథ్, నెల్లూరు జిల్లా సహాయ కార్యదర్శి ఎనోష్ మస్తాన్, కోశాధికారి సునీల్, సీనియర్ పాత్రికేయులు సుబ్బయ్య,సుధాకర్,సరస్వతి,మణి, ధనలక్ష్మి తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.

# గిరిజన విద్యార్థులు పాఠశాలల్లో చేరిక




## యానాదిస్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చేయూత

నెల్లూరు స్వర్ణసాగరం జూన్ 17

నెల్లూరు జిల్లా యానాదిస్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ కార్యదర్శి పోట్లూరి శ్రీనివాసులు ఆధ్వర్యంలో కోవూరు ఎన్ ఎస్ ఆర్ గిరిజన కాలనీ నుంచి ఏలూరు చరణ్ 6 క్లాసు విడవలూరు మండలం రామచంద్రపురం గిరిజన కాలనీ నుంచి దేవరకొండ ప్రేమ్ కుమార్ ఐదో క్లాస్ దేవరకొండ సంతోష్ 3 క్లాసులో చేరారు. గిరిజనులను అక్షరాస్యులుగా చేయాలన్న గట్టి తలంపుతో నెల్లూరు జిల్లాలో యానాదిస్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కార్యదర్శి పోట్లూరి శ్రీనివాసులు కృషిని గిరిజన కుటుంబీకులు హర్షిస్తున్నారు

# మామిడి రైతు నడ్డి విరిచిన కూటమి ప్రభుత్వం..?

**-వైసీపీ యువ నాయకుడు సాము**

శ్రీరంగరాజపురం :స్వర్ణ సాగరం: (జూన్ 17)



కూటమి ప్రభుత్వం వచ్చి సంవత్సరం పాలన... లో రైతాంగం పూర్తిగా దిక్కుతోచని స్థితిలో మునగడమే కాకుండా... గత నెల రోజులుగా మామిడి రైతులు .. మానసికంగా పండించిన పంట చేతికందేసరికి.. తీరా కొనుగోలు లేక... పంటను చేనుపైనే వదిలే స్థితిలో నేడు రైతులు మునిగిపోయారని వైఎస్ఆర్ సిపి యువ నాయకుడు సాము దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన రైతాంగ సమస్యపై విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి మొదటి సంవత్సరంలోనే మామిడి రైతులకు తీవ్ర నష్టం జరిగిందని, మామిడి రైతుల కష్టాలను పట్టించుకునే నాయకుడే లేక , రైతురోడ్డు ఎక్కే పరిస్థితి ఈరోజు నెలకొందన్నారు.గత ప్రభుత్వంలో తోతా పూరి రూ:20000 నుంచి 30,000, 40 వేలకు అమ్మిన రైతులు లాభాల్లో ఉండటం జరిగిందన్నారు. అయితే ప్రస్తుత పరిస్థితి చాలా దారుణంగా ఉందని ,ఇటీవలే రైతులు సమస్యలను పరిష్కరిస్తామని... జిల్లాకు వచ్చిన వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు రైతులకు ఏ న్యాయం చేశారని ప్రశ్నించారు. మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాల్సిన సీఎం చంద్రబాబు సైతం జిల్లా ప్రజల కష్టాలను గాలికి వదిలి.... యోగా ఆంధ్ర కార్యక్రమాలు చేపట్టడం ఏంటని ప్రశ్నించారు. ప్రతి ఏటా రైతులు మామిడి పంటలో లక్షలు ఖర్చు చేసి కోత కి వచ్చే సమయంలో రేటు లేక రోడ్డుపై పారవేసే పరిస్థితి ఈ ప్రభుత్వంలో నెలకొనిందని ఆరోపించారు. స్థానికంగా ఉన్న ఫ్యాక్టరీల వద్ద లోకల్ లీడర్లు టోకెన్ లలో అడ్డదారులు తొక్కుతున్నారని, సామాన్య రైతులకి టోకెన్ లు అందడం లేదని వాపోయారు. ఇకనైనా మామిడి పంటపై ప్రభుత్వ ఉన్నదా అధికారులు చొరవ తీసుకొని ,కూటమి ప్రభుత్వం నాయకులు రైతుపై దృష్టి సారించి రైతుల పక్షాన నిలబడి స్థితి రావడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# కూటమి ప్రభుత్వం ఏడాది పాలన వైఫల్యాలపై వైసిపి పుస్తకావిష్కరణ

కనిగిరి స్వర్ణ సాగరం జూన్ 17



కనిగిరి నియోజకవర్గం వైసీపీ ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్ ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం సంవత్సర పాలన వైఫల్యాలపై కనిగిరి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పుస్తకావిష్కరణ చేశారు.ఈ నియోజకవర్గ వైసిపి నాయకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజలకు మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చే ప్రజల్ని వెన్నుపోటు పొడిచారని అన్నారు కూటం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో హత్యలు అత్యాచారాలు పెరిగాయని అన్నారు వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలన సుపరిపాలనని చంద్రబాబు నాయుడు పరిపాలన మోసపూరితమైన పరిపాలనని నాయకులు యద్దేవా చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్,వైస్ చైర్మన్ పులి ప్రశాంతి,వైసీపీ రాష్ట్ర ఎస్సి సెల్ కార్యదర్శి కటికల వెంకట రత్నం,సూరసాని మోహన్ రెడ్డి,గాండ్లపర్తి ఆదినారాయణ రెడ్డి,ఎర్రబల్లి దేవరాజు,సిరప గోవర్ధన్ రెడ్డి,మద్దిశెట్టి భారతి,దమ్ము వెంకటయ్య, తోడేటి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నరు.

# "వృద్ధుల ఆప్యాయత అనురాగాల మధ్య జన్మదిన వేడుకలు"



తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం జూన్ 17

మండలంలోని కోడూరు వృద్ధాశ్రమంలో మంగళవారం జై భారత్ నేషనల్ పార్టీ సర్వేపల్లి నియోజకవర్గ యువ నేత కనగలూరు సురేంద్రబాబు జన్మదిన వేడుకలు నియోజకవర్గ నేత మద్దిలేటి శరత్ కుమార్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సురేంద్రబాబును గజమాలతో ఘనంగా సత్కరించారు, వృద్ధులకు భోజన వసతులు కల్పించారు,శరత్ బాబు మాట్లాడుతూ జై భారత్ నేషనల్ పార్టీ అధినేత వివి లక్ష్మీనారాయణ ఆశయాలను దృష్టిలో పెట్టుకొని వాటిని ప్రజాక్షేత్రంలో అమలుపరిచేందుకు నియోజకవర్గంలో యువత ముందుకు పోతుందన్నారు. యువత ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు శరత్ బాబు తెలిపారు. ఈ అభినందన కార్యక్రమంలో పార్టీ నేతలు జానా కోటేశ్వరరావు గౌడ్ బెల్లపు భాస్కర్ కడివేటి మస్తాన్, విజయ్, రాము నలిసెట్టి పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# జనసేన పార్టీ ఆధ్వర్యంలో కాలువలలో బ్లీచింగ్



పొదలకూరు స్వర్ణ సాగరం జూన్ 17

సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు పొదలకూరు మండలంలోని శ్రామిక నగర్ గిరిజన కాలనీ నందు పంచాయతీ కాలువల్లో దోమల నివారణకు బ్లీచింగ్ కొట్టి పారిశుధ్యం నిర్వహించడం జరిగింది లివర్షాలు కారణంగా పంచాయతీ కాలువల్లో మురుగునీరు నిల్వ ఉండిపోయి చెత్త పేరుకుపోయి గత ప్రభుత్వంలో కాలవల్లో నీళ్లు బయటకు వెళ్లే దానికి మార్గాలు లేకుండా నిర్మించడం వల్ల వాటిల్లో దోమలు చేరి అంటు రోగాలు వచ్చి ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితిలిఈరోజు కూటమిలో భాగంగా కుటమి నాయకులందరినీ కూడా కలుపుకొని ఆ గిరిజన కాలనీని సందర్శించి అక్కడ కాలవల్లో బ్లీచింగ్ కొట్టి పంచాయతీ అధికారులకి కాలువలు క్లీన్ చేయాలని చెప్పడం జరిగింది అక్కడ పేద గిరిజనులు నివాసము ఉంటున్నారు వారికి ఎప్పుడు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇవ్వడం జరిగింది దాంతోపాటు కొంతమందికి తల్లికి వందనం రాలేదని చెప్పడంతో వారిని సచివాలయం కెళ్ళి అప్లై చేసుకునేందుకు ఏర్పాటు చేయడం జరిగింది. లిసర్వేపల్లి నియోజకవర్గం లోని 117 పంచాయతీల్లో కూడా గ్రామ పంచాయతీ పాలకులు పారిశు ధ్య పనులను నిర్వహించాలని తెలియజేస్తున్నము అలా నిర్వహించిన ఎడల సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి గారి దృష్టి తీసుకువెళ్లి చర్యలు చేపడతామని మనస్ఫూర్తిగా తెలియజేస్తున్నాం. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సందూరి శ్రీహరి, మణి,బిజెపి మండల సీనియర్ నాయకులు సిహెచ్ సుబ్రహ్మణ్యం సురేంద్రబాబు రవీంద్రబాబు వెంకటేశ్వర్లు ఓబులేసు గురుస్వామి పద్మనాభం జనార్ధన్ రెడ్డి శ్రీనివాసులు కృష్ణయ్య పొదలకూరు మండల అధ్యక్షుడు పూల ప్రశాంత్

# గాంధీయవాదిరావిప్రోలు మృతి తీరనిలోటు

**గాంధీజీ సత్యాగ్రహ ఆశ్రమంలో పలువురు సంతాపం**

ఇందుకూరుపేట స్వర్ణ సాగరం జూన్ 17



బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి మంచి స్థాయికి చేరుకొని విశాఖపట్నంలో స్థిరపడినటువంటి రావిప్రోలు. సుబ్రహ్మణ్యంమంగళవారం స్వర్గస్తులైనారు. పల్లిపాడు గ్రామంలో ఉన్నటువంటి మన పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమానికి ఒకప్పుడు కమిటీ మెంబర్ గాను ఆహ్వాన కమిటీ చైర్మన్ గానూ పని చేసినారు, అదేవిధంగా ఆయన యుక్త వయసులో ఉన్నప్పటి నుంచి మన గాంధీ ఆశ్రమానికి ఎనలేని కృషి చేశారు, ప్రముఖ సినీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గాంధీ ఆశ్రమానికి తీసుకువచ్చారు, సబర్మతి ఆశ్రమం మరియు ఉత్తర భారత దేశంలో ఉన్నటువంటి ప్రముఖ గాంధీయవాదులను, అదేవిధంగా ప్రముఖులను గాంధీ ఆశ్రమ అభివృద్ధికి కృషి చేయాలని, గాంధీ ఆశ్రమానికి ప్రతి సందర్భంలోనూ వారిని తీసుకొస్తుండేవారు. గాంధీ జయంతి మరియు వర్ధంతి అనేక సభలను జయప్రదం చేసేవారు, అలాంటి ఉన్నత విలువలు కలిగిన మరియు గాంధీ ఆశ్రమం అభివృద్ధి గురించి నిరంతరం ఆలోచించే వ్యక్తి కన్నుమూయడం మన పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమానికి తీరని లోటు అని గాంధీ ఆశ్రమం కన్వీనర్ గణేశం. కల్పనమ్మ అదేవిధంగా గాంధీ ఆశ్రమ కో కన్వీనర్ నెల్లూరు. రవీంద్రారెడ్డి మరియు కమిటీ సభ్యులు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# సిపిఐ పార్టీ మహాసభల గోడ పత్రికలు ఆవిష్కరణ



కనిగిరి స్వర్ణ సాగరం జూన్ 17

దర్శిలో ఈ నెల 21,22,23 తేదీలల్లో జరుగు సిపిఐ పార్టీ మహ సభలన జయప్రదం చేయాలని గోడ పత్రికలు,ఆవిష్కరించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు వై.రవీంద్రబాబు పాల్గొన్నారు.కనిగిరి నియోజక వర్గ కార్యదర్శి సయ్యద్ యాసిన్ మాట్లాడుతూ వెనుక పడ్డ ప్రకాశం జిల్లాను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి బాటలో నడపాలని నిమ్జ్ ఏర్పాటు చేయాలని నిరుద్యోగ యువకులకు బ్రతుకు తెరువు, చూపాలని పశ్చిమ ప్రాంతం సాగుకు, త్రాగుకు నీరు లేక నిత్యం కరువు తో పండించిన గిట్టుబాటు ధరలు లేక రైతులు అప్పుల ఊబిలో చిక్కుకొని వ్యవసాయం వదులుకొని కూలిపనులకు దూరప్రాంతాలకు వలసలుపోతున్నారు.కూటమి ప్రభుత్వం పనులు మొదలు పెట్టి పూర్తి చేసి నీరు ఇస్తామన్ననారు ఇంత వరకు దాని ఊసే లేదు బడ్జెట్ లో 4వేల కోట్లు కేటాయించి పనులు పూర్తి చేయాలని సిపిఐ పార్టీ అనేక ఉద్యమాలు చేసి ప్రభుత్వానికి అవసరత తెలిపిన ఆలోచించకుండా కాలాయపనచేస్తూ పోలవరం ప్రాజెక్ట్ ద్వారా బనక చెరువు ఈ ప్రాంతాని నీరు ఇస్తామనుట దీనివెనుక మన ప్రాంతానికి మరల మోసం చేయడమే కనిపిస్తున్నదన్నారు.పరిశ్రమల పేరుతో ప్రభుత్వ భూమి మాత్రం మాయమైపోతున్నదని అన్నారు భూమిలేనివారికి భూమిపంచిన ఘనత కమ్యూనిస్టు పార్టీదే అన్నారు.ఈ కార్యక్రమములో నియోజక సహాయక కార్యదర్శి పందిటి మోహన్,మండల సహాయక కార్యదర్శి షేక్.గులాం హుస్సేన్,రైతుసంఘం జిల్లా నాయకులు గుజ్జుల బాలిరెడ్డి,ఎఐటియుసి నాయకులు షేక్.ఖాసిం,మీరవలి,ఎ ఐ.ఎస్ ఫ్ నాయకులు పవన్, ఇఫ్రోజ్,సురేష్,రామయ్య, పాల్గొన్నారు.

# ఉపాధి కూలీల బిల్లులు వెంటనే చెల్లించాలి




బడుగు వెంకటేశ్వర్లు

గత మూడు నెలలు నుండి ఉపాధి పనులు కూలీలు బిల్లులు చెల్లించకుండా చంపడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించ్చారు.ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం హనుమంతుని పాడు మండల అభివృద్ధి కార్యాలయం ఎదుట ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని ధర్నా నిర్వహించారు.ఈ ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడుతూ గత మూడు నెలలుగా కూలీలు పనులు చేస్తుంటే బిల్లులు చెల్లించకుండా అర్ధాకులతో చంపడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ప్రస్తుత పని చేస్తున్న కూలీల గురించి ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు.పని ప్రదేశంలో మౌలిక వసతులు కల్పించాలని పనిముట్లు ఇవ్వాలని మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు పని చేసే క్రమంలో చిన్నపాటి దెబ్బ తగిలిన కనీసం కట్టుగుడ్డబోతమందు కూడా ఇవ్వకుండా కూలీల పట్ల తీవ్ర నిర్లక్ష్యం చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తపరిచారు.ప్రభుత్వం పని చేస్తే డబ్బులు రావడం లేదని అటువంటి పరిస్థితులు నుండి కూలీలకు భరోసా కల్పించాలని అందుకొరకై తక్షణమే 9 నెలల బిల్లులు వెంటనే విడుదల చేసి కూలీలకు ఆదుకోవాలని ఆలస్యానికి అదనంగా రుసుము చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధి మెట్లు కత్తి సామేలు బాలయ్య గురు స్వామి రమణారెడ్డి ఏసు ఇజ్రాయిల్ ప్రభాకర్ రెడ్డి కత్తి ఏబు రాములు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొనగా ధర్నాకు హనుమంతునిపాడు మండల కేంద్రం సర్పంచ్ కత్తి రాజారావు సంఘీభావం తెలిపినారు.ఎంపీడీవో రంగ సుబ్బారాయుడు మాట్లాడుతూ వారంలోపు ఉపాధి కూలీలందరికీ బిల్లులు పడేవిధంగా కలెక్టర్గారు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినారని తొందరలో సమస్య పరిష్కారం అవుతుంది అని హామీ ఇచ్చారు.

# రైతులకి నాటు కోళ్ల పెంపకం మునగ చెట్లు పై అవగాహన కార్యక్రమం

బంగారుపాళ్యం.స్వర్ణసాగరం.జూన్ 17



చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారు పాళ్యం మండలంలోని రైతులకు నాటు కోళ్ల పెంపకం మునగ చెట్ల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. ప్రస్తుత పరిస్థితులలో అనారోగ్యానికి కారణం అవుతున్న బ్రాయిలర్,లేయర్స్ కోడి మాంసము కన్నా నాటు కోళ్లు పెంచి వాటిని తినడం ద్వారా మంచి ఆరోగ్యం ఉంటుందని పశు సంవర్ధ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఆసిఫ్ తెలియజేశారు ఇందులో ప్రభుత్వం సబ్సిడీ కింద ఒక యూనిట్ ధర 5000 రూ, ఇందులో ఆసిల్ జాతి కోళ్ళు ఒక కేజీ బరువు ఉన్నది 10 కోళ్లు,దాణా 25 కేజీలు,మెడికల్ కిట్టు, ట్రాన్స్పోర్ట్ తో కలిపి యూనిట్ ధర ఉంటుంది అమౌంటు మండల సమైక్య కార్యాలయం లేదా ఎఫ్ పి ఓ కార్యాలయంలో చెల్లించి నాటు కోళ్లు తీసుకోవచ్చని తెలిపారు.లైవ్ లీ హుడ్స్ డిపిఎంయు ఏపిఎం వివి రమణ తెలిపారు. అలాగే మునగ చెట్ల పెంపకంపై ఎంజి ఎన్ఆర్ఐ జిఎస్ ద్వారా అవగాహన కల్పించడం జరిగినది.ఆసక్తి గల రైతులు ఎఫ్ పి ఓ కార్యాలయంలో సంప్రదించాలని తెలియజేయడం జరిగినది.ఈ కార్యక్రమంలో రైతులు ఏపీఎం రవి, ఎఫ్ పిఓ డి రుతు, సీసీలు, రైతుమిత్రలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యం పట్ల అలసత్వం వహించరాదు





## మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి స్వర్ణ సాగరం జూన్ 17

పారిశుద్ధ్యం పట్ల అలసత్వం వహిస్తే ప్రభుత్వ పరమైన కఠిన చర్యలు తీసుకుంటామని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు.మంగళవారం కనిగిరిపట్టణంలోని ఒకటవ వార్డులోని శివనగర్ కాలనీలో ప్రజలు ఫిర్యాదు మేరకు మున్సిపల్ అధికారులతో కలసి ఆయన పర్యటించారు.అనంతరం ప్రజలు నుండి సమస్యలను ప్రత్యక్షంగాఅడిగి తెలుసుకోగా వార్డులో సైడు కాలువల్లో పూడిత చెత్త చెదారంతో దుర్వాసన వస్తున్నదని ఫిర్యాదు చేయగా వెంటనే మున్సిపల్ అధికారుల పిలిపించి పనితీరుపై అగ్రహా వ్యక్తం చేశారు.మున్సిపల్ కార్మికులచే అపరిశుభ్రమైన ప్రాంతాన్ని పరిశుభ్రము చేయించ్చారు.పట్టణంలో ఎక్కడ కూడా అపరిశుభ్రంగా ఉండ కుండా చూడాలని ప్రజలు నుండి ఫిర్యాదులు వచ్చినట్లయితే సహించేది లేదన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులలో పారిశుద్ధ్యం పట్ల నిర్లక్ష్యం చేయరాదని,ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం వహించరాదని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.ఆరోగ్య సిబ్బంది డ్రైడే ఫ్రైడే కార్యక్రమాలు పట్ల నిర్లక్ష్యంగా ఉండి ప్రజలకు పరిసరాలు పరిశుభ్ర త గురించి అవగాహన కల్పించక పోతే విష జ్వరాలైన డెంగ్యూ మలేరియా టైఫాయిడ్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు.పారిశుద్ధ్యం ఆరోగ్యం మరియు జీవన ప్రమాణాలకు సంబంధించినది కాబట్టి ప్రతి ఒక్కరూ పారిశుద్ధ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు.ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ నాయబ్ రసూల్ సచివాలయం సిబ్బంది పారిశుధ్య కార్మికులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు లో నూతన ' షాలోమ్ ' పరుపుల విక్రయ షోరూం ప్రారంభం



చిత్తూరు, స్వర్ణ సాగరం,జూన్ 17

నరంలోని కట్టమంచి తిరుపతి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ' షాలోమ్ ' పరుపుల విక్రయ షోరూం ప్రారంభమయ్యింది. ఈ మేరకు హిడ్డయ్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ జస్టిన్ రాజు, కేరళకు చెందిన ప్రముఖ ఫాస్టర్ రెవరెండ్ ఎన్ పీటర్ తదితరులు మంగళవారం ఉదయం రిబ్బన్ కట్ చేసి షో రూమ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూం మేనేజింగ్ డైరెక్టర్ జస్టిన్ రాజు మాట్లాడుతూ... తమ షోరూంలో స్ప్రింగ్, కాయర్, ఫోమ్, లాటెక్స్, ఆర్థో అనే 5 రకాల పరుపులను విక్రయానికి ఉంచినట్లు వెల్లడించారు. తమ హిడ్డయ్ ఇండస్ట్రీస్ లో తయారవుతున్న సంబంధిత పరుపులు నేరుగా కస్టమర్లకు ఉంచినందున, తక్కువ ధరలకే కొనుగోలు చేసుకునే అవకాశం ఉందన్నారు. తమ వద్ద రూ 3 వేల నుంచి ఒక లక్ష రూపాయల వరకు విలువగల పరుపులు లభిస్తాయని, కస్టమర్ల సౌకర్యార్థం బజాజ్ ఫైనాన్స్ ద్వారా ఈఎంఐల పద్ధతిలో రుణ సదుపాయం సైతం కల్పిస్తున్నట్లు వివరించారు. పలు సైజులలో లభించే సంబంధిత పరుపుల కొనుగోలుపై ప్రత్యేక ఆఫర్లను ఇస్తున్నట్లు వెల్లడించారు. ఒక పరుపు కొన్న వారికి, అదే విలువగల మరొక పరుపుతో పాటు, 4 చొప్పున తలగడలు, తలగడ కవర్లు, రెండు బెడ్ షీట్లను ఉచితంగా అందిస్తామని స్పష్టం చేశారు. తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలలో తమ కంపెనీ ఉత్పత్తులు బాగా అమ్ముడుపోతున్నాయని, ఆంధ్రాలో తొలిసారిగా చిత్తూరు నగరంలో షోరూంను ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. తమ కంపెనీ అవుట్లెట్ ద్వారా కస్టమర్లకు నేరుగా విక్రయాలు సాగిస్తున్నందున తక్కువ లాభాపేక్షతో ఆకర్షణీయమైన ఆఫర్లను అమలు చేసేందుకు వీలువుతోందన్నారు. ఉత్పత్తులపై 10 సంవత్సరాల వారంటీని ఇస్తున్నామని, ఈ అవకాశాన్ని చిత్తూరు నగరంతో పాటు , పరిసర ప్రాంతాలకు చెందిన కస్టమర్లు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కాగా ఈ కార్యక్రమంలో చిత్తూరు షోరూం ఇన్చార్జిలు అలెక్స్, సతీష్, మేనేజర్ రంజిత్, రిటైర్డ్ డిఎస్పి అమర్నాథ్ ఫెడ్రిక్స్, స్థానిక ప్రముఖ పాస్టర్లు రెవరెండ్ జోబ్, రెవరెండ్ శామ్యూల్ తో పాటు పెద్ద ఎత్తున కస్టమర్లు పాల్గొన్నారు.

# తోతాపూరి మామిడి గిట్టుబాటు ధరగా కి.లో రూ.12/- గా ప్రభుత్వం నిర్ణయిచ్చింది

## జిల్లాలోని మామిడి రైతులు ఎవరు ఆందోళన చెందొద్దు : జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు, స్వర్ణ సాగరం,జూన్ 17



జిల్లాలోని తోతాపూరి మామిడి రైతులను రాష్ట్ర ప్రభుత్వము అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఎవరు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం సాయంత్రం సమయంలో టెలి కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు దిశా దశ నిర్దేశాలు జారీ చేశారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. వాతావరణ పరిస్థితులు, రైతులు తీసుకున్న జాగ్రత్తలు వలన మామిడి దిగుబడి పెరిగిందని తెలిపారు.అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, యుక్రేయన్ యుద్ధం వలన మామిడి పల్ఫ్ ఎగుమతి అనేది చాలావరకు తగ్గిందని అన్నారు. పక్క రాష్ట్రాలైనటువంటి తమిళనాడు కర్ణాటకలో క్రిష్ణగిరి మార్కెట్ నుంచి మార్కెట్ గుజ్జు పరిశ్రమల నుంచి పార్లే ,కోకోకోలా, పెప్సీ కంపెనీ వాళ్లు ఎక్కువగా కొనుగోలు చేశారని తెలిపారు. దాని కారణంగా గత రెండు సీజన్ లోను గుజ్జు నిల్వలు అలాగే ఉండిపోయాయని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా స్థాయిలో ప్రజా ప్రతినిధులు అధికారులు గుజ్జు పరిశ్రమలు ,రైతులు, రైతు సంఘాల నేతలతో సమావేశం నిర్వహించి సమస్యలు తెలుసుకొని ప్రభుత్వానికి తెలియజేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రైతులు ఎక్కడ కూడా నష్టపోకుండా రైతులకు న్యాయం జరిగేలా మద్దతు ధర కిలోకి 12 రూపాయల కొనుగోలుతో తోతాపూరిని కొనుగోలు చేయలని ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ప్రాసెసింగ్ యూనిట్ వారు రైతులకు చెల్లించాల్సిన ధర 8 రూపాయలు, మరియు 4 రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ రూపంలో రైతులకు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. రైతులు ఎక్కడ కూడా నష్టపోకుండా ప్రతి రైతు చివరి పంట వరకు అందరినీ ప్రభుత్వము ఆదుకుంటుందని తెలిపారు.రైతులు ఎలాంటి తొందరపాటు లేకుండా పంట కోత కోయవద్దని అలాగే మామిడి పక్వానికి వచ్చిన తరువాత కోయాలని తెలిపారు. చివరి కేజీ వరకు ప్రభుత్వము ప్రతి రైతుకి నాలుగు రూపాయల సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. రైతులు మండీలు, ట్రేడర్స్ గుజ్జు పరిశ్రమల దగ్గరికి తొందరపడి వెళ్ళవద్దని దిగుబడు రాకముందే కోతకోయొద్దని తెలిపారు.

# చిత్తూరు జిల్లా మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది:జిల్లా ఇంచార్జ్ కలెక్టర్

## మామిడి రైతుల సందేహాలు నివృత్తికి హెల్ప్ లైన్ ఏర్పాటు . . 08572-242777, 9491077325 నెంబర్ లకు ఫోన్ చేసి సహాయం పొందవచ్చు

చిత్తూరు,స్వర్ణ సాగరం, జూన్ 17

చిత్తూరు జిల్లాలో మామిడి రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని, అపోహలను నమ్మి ఆందోళన చెందవద్దని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ జి. విద్యాదరి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా సచివాలయం లోని సమావేశ మందిరం లో జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ తోతాపూరి మామిడి కాయల కొనుగోలు ప్రక్రియ పై పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 98 వేల ఎకరాలలో దాదాపు 5 లక్షల మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడి పండిస్తున్నారన్నారని, పంట దిగుబడి క్రమంగా పెరుగుతున్నదన్నారు. జిల్లాలో 35 ప్రాసెసింగ్ యూనిట్ లు ఉండగా అందులో 27 పరిశ్రమలు మాత్రమే మామిడి పండ్ల ప్రాసెసింగ్ చేస్తున్నాయన్నారు. గుజ్జు పరిశ్రమల ద్వారా ప్రతి రోజూ దాదాపు 7 వేల మెట్రిక్ టన్నుల మామిడి ప్రాసెసింగ్ జరుగుతున్నదన్నారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి మామిడి దిగుబడి అధిక మొత్తంలో ఉంటున్నదని, 2023 సం.లో సైతం అధిక దిగుబడి వచ్చిందని, ఆ సమయంలో గుజ్జు పరిశ్రమలు అధిక మొత్తంలో మామిడి పండ్ల ప్రాసెసింగ్ చేయడం జరిగిందని, అందులో దాదాపు 40 వేల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి ఇంకా పరిశ్రమల వద్ద మిగిలి ఉందని అన్నారు. ఈ కారణంగా ఈ సంవత్సరం గుజ్జు పరిశ్రమల నుండి డిమాండ్ తక్కువగా ఉందని, దీనితో మామిడి ధర తక్కువ పలుకుతున్నదన్నారు. మామిడి రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో తోతాపురి మామిడి కి.లో రూ.12/–గా ధర నిర్ణయిస్తూ జూన్ 6న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసిందని, ఇందులో గుజ్జు పరిశ్రమలు రూ.8/–లు చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వం అదనంగా



రూ.4/– మద్ధతు ధర ను రైతుల ఖాతాలకు నేరుగా జమ చేస్తుందని తెలిపారు. 38 ర్యాంపులు, 2 మండీల వద్ద అమ్ముకునే రైతులకు కూడా ప్రభుత్వం రూ.4/– మద్ధతు ధర ను అందిస్తుందన్నారు. ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయడానికి జిల్లాలో కార్యాచరణ ప్రణాళికలను రూపొందించడం జరిగిందన్నారు. మామిడి కాయల కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించడానికి ప్రతి ప్రాసెసింగ్ యూనిట్, మండీలు, ర్యాంప్ వద్ద హార్టీకల్చర్, అగ్రి కల్చర్ అసిస్టెంట్ మరియు ఒక వి ఆర్ ఓ తో కూడిన రెండు బృందాలను ఏర్పాటు చేశామని, ఒక బృందం ఉదయం 8 గం. ల నుండి మ.2 గం.ల వరకు, మరొక బృందం మ. 2 గం. ల నుండి రాత్రి 8 గం. ల వరకు తోతాపురి మామిడి రైతుల వివరాలు, వారి ఆధార్, బ్యాంక్ అకౌంటుల వివరాలు, తదితరాలను సేకరించి పంపుతారని, రైతులకు సబ్సిడీ కొరకు ఈ వివరాలను ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందన్నారు. ప్రతి మండలాలకు మండల స్థాయి ఇంచార్జ్ లను నియమించడం జరిగిందని, ప్రాసెసింగ్ యూనిట్ లు ఎక్కువగా ఉన్న పూతలపట్టు, తవణంపల్లి, గుడిపాల మండలాలకు జిల్లా స్థాయి అధికారులను ఇంచార్జ్ లుగా నియమించి పర్యవేక్షించడం జరిగిందన్నారు. ఈ ప్రక్రియను జిల్లా స్థాయిలో పర్యవేక్షించడం జరుగుతుందని, జిల్లా సచివాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, మూడు షిఫ్ట్ లలో సిబ్బంది పని చేస్తారన్నారు. జిల్లాలోని మామిడి రైతులకు ఎలాంటి సందేహాలు ఉన్నా08572–242777, 9491077325 హెల్ప్ లైన్ కు సంప్రదించాలని కోరారు. మార్కెటింగ్ శాఖ ఏ డి, లీగల్ మెట్రాలజీ మరియు డి టి ల ద్వారా టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసి ర్యాంప్ లు, మండీల వద్ద మామిడి కొనుగోలు ధరలను పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ప్రాసెసింగ్ యూనిట్లు జూన్ 7 నుండి గుజ్జు తయారీ ప్రారంభించాయని, అప్పటి నుండి రైతులు, కొనుగోలుదారులు, ప్రాసెసింగ్ యూనిట్ ల తో జిల్లా యంత్రాంగం అండగా నిలుస్తున్నదన్నారు. తోతాపూరి మామిడి కొనుగోలు కు సంబంధించి రైతులు ఆందోళనకు గురి కావడం జరుగుతున్నదని, మామిడి ధరను క్రమంగా రూ.6/– కు తగ్గకుండా చూస్తున్నామని, రైతులు గుర్తించాలన్నారు. రైతులు తొందరపడి పక్వానికి పక్వానికి రాని మామిడికాయలు కోసి తీసుకురావడం వల్ల అది పండు మారడానికి ఎక్కువ రోజులు సమయం తీసుకుని ఫలితంగా నాణ్యత తగ్గిపోవడమే కాకుండా ఎక్కువ ప్రాసెసింగ్ చేయడానికి ఉండదు. రైతులు పక్వానికి వచ్చిన కాయలను కోసి ఫ్యాక్టరీలకు తరలించాలి ఫ్యాక్టరీల వద్ద ఆలస్యం అవుతున్నప్పుడు దయచేసి కాయలు కోతలు కొంతమేరకు ఆలస్యం చేయాలి లేనట్లయితే కాయలు కోసి ఫ్యాక్టరీ ముందు రెండు రోజులు మూడు రోజులు నిలపడం వల్ల కాయల నాణ్యత చెడు పోతుంది. పండు బారుతాయి. ఏ వారం ఎంత కాపు వస్తుంది, జూన్ మాసం, జూలై మాసం, ఆగస్టు మొదటి వారం లోపల మామిడికాయలు నాణ్యతగా ఉంటాయని తెలిపారు గత ఎనిమిది రోజుల నుంచి తోతాపూరి మామిడికాయలు 38 వేల టన్నులు ఫ్యాక్టరీలకు సరఫరా చేయడం జరిగింది. ప్రతి రైతు పండించిన చివరి మామిడికాయ వరకు, ఆగస్టు సీజన్ వరకు సబ్సిడీ ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. రైతులు వెంటవెంటనే కాయలు కోసి ఫ్యాక్టరీలకు తరలించడం కాకుండా అందరూ రైతులకు అవకాశం వచ్చేలా సహకరించాలని మామిడి రైతులకు జాయింట్ కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# బాధిత శిరీషను పరామర్శించిన NDA కూటమి నేతలు..





## తనకు న్యాయం చేయాలంటూ కన్నీటి పర్వతమైన శిరీష..

కుప్పం స్వర్ణసాగరం న్యూస్

కుప్పం నియోజకవర్గం లోని కుప్పం మండలంలో నారాయణపురం గ్రామంలో నిన్నటి దినం సభ్య సమాజం తలదించుకునేలా కుప్పం మండలం మున్సిపాలిటీ పరిధిలోని నారాయణపురం గ్రామంలో తీసుకున్న అప్పు తీర్చలేదని చెట్టుకు కట్టేసి కొట్టిన ఘటన మీద NDA కూటమి నేతలు జనసేన పార్టీ కుప్పం ఇంచార్జ్ నరేష్ మరియు భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తులసి నాథ్, దళిత ఉద్యమ నేత దేవరాజ్ మాదిగ కుప్పం 100 పడగల ఆసుపత్రిలోని బాధిత మహిళ శిరీషను పరామర్శించి జరిగిన సంఘటన గురించి అడిగి తెలుసుకున్నారు అప్పుడే జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ గారు ఫోన్ లైన్ లో రావడంతో జనసేన పార్టీ కుప్పం ఇంచార్జ్ నరేష్ గారు మాట్లాడి ఫోను ను ఆమెకు అందించడం జరిగింది జరిగిన విషయాన్ని జిల్లా ఇన్చార్జి మంత్రి మండపల్లి రాంప్రసాద్ గారికి తెలియజేయడం ఆయన సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే నేరుగా వచ్చి కలిసి తగిన న్యాయం చేస్తానని భరోసా కల్పించారు అనంతరం కూటమి నేతలతో బాధిత మహిళా శిరీష మాట్లాడుతూ పక్కా ప్రణాళికతో తన మీద దాడి చేయాలని పథకం రచించి దాడి చేశారని, తనకు ఆ గ్రామంలో ప్రాణహాని ఉందని అలాగే 10 రూపాయలు వడ్డీ తీసుకుని మా కుటుంబాన్ని చిన్నాభిన్నం చేశారని తన బిడ్డను తన ముందరే తీసి విసిరి రోడ్డు పక్కన పారేశారని తన తాళ్లతో కట్టేసి తీవ్రంగా కొట్టారని కన్నీళ్ళతో చెప్పడంతో అందరి మనసులు చలించాయి మొత్తం మీద ఈ ఘటన జరగడం చాలా విచారకరమని NDA నేతలు తీవ్రంగా ఖండిస్తూ బాధిత కుటుంబానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ గారు, బిజెపి పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి గారు అండగా ఉంటామని జనసేన, భారతీయ జనతా పార్టీ వీరవనితలు మరియు దళిత నేతలు బాల చంద్రబాబు, కోదండ మాదిగ తెలియజేసారు

# బడుగుమాకనపల్లి వారపు సంత గుత్తేదారుల విషయంలో చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కు వినతి పత్రం



శాంతిపురం స్వర్ణసాగరం

శాంతిపురం మండలం కెనమాకులపల్లి పంచాయతీ బడుమాకునపల్లి వారపు సంత విషయమై గత రెండునెలల నుండి వారపు సంతలోలి గుత్తేదారుల ఆగడాల విషయం గురించి ఈరోజు చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి గారు ఎయిర్పోర్ట్ భూముల వ్యవహారంలో శాంతిపురం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రైతులతో ముఖాముఖి సమావేశం అనంతరం జాయింట్ కలెక్టర్ విద్యాధరి గారిని కలిసి క్షుణ్ణంగా బడుగుమాకనపల్లి వారపు సంతలో గుత్తేదారులు చేస్తున్న మోసం అధిక ధరలకు వసూలు, అధికారుల యొక్క నిర్లక్ష్యం క్షుణ్ణంగా జాయింట్ కలెక్టర్ గారికి వివరించడం జరిగింది అలాగే జిల్లా కలెక్టర్ గారికి అర్జీ ఇచ్చిన ఫోటోలను చూపిస్తూ అంతలో కుప్పం జననాయకుడిలో ఫిర్యాదు చేసిన అర్జీని పరిశీలించిన జాయింట్ కలెక్టర్ విద్యాధరి గారు మండల అభివృద్ధి అధికారి MPDO గారి రిపోర్టు వచ్చిన స్వయంగా తానే సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగింది

అనంతరం కేవలం సంతలో ఏర్పాటుచేసిన బోర్డులు తెలుగులో మాత్రం ఉన్నాయని కన్నడ మరియు తమిళ్ చందన రైతులు ఇక్కడికి రావడం జరుగుతుందని వారికి సంబంధించిన కన్నడ మరియు తమిళ్ భాషలో నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాలని చాలామంది గుత్తి దారులు రసీదులు ఇవ్వడం లేదని దౌర్జన్యం చేస్తున్న విషయాన్ని మేడమ్ గారి దృష్టికి తీసుకెళ్లడంతో అన్నిటికీ సమాధానం ఎంపీడీవో గారి విచారణ జననాయకుడు విచారణ అనంతరం సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగింది..

# మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి కి ఆత్మీయ సన్మానం





స్వర్ణ సాగరం కె వి బి పురం:

మోడల్ స్కూల్ మోహన్ రెడ్డి మరియు జయ కుమార్ కిరణ్ కుమార్ బదిలీ పైన వెళ్లి నారు ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి సేవలు చిరస్మరణీయం పాఠశాల అభివృద్ధి కోసం అనునిత్యం కష్టపడి పిల్లలను క్రమశిక్షణగా చుసుకున్నరు పదో తరగతిలో నూటికి 100% ఇంటర్లోను వందకి 100% పిల్లలు పిల్లలు పాస్ అయ్యేవిధంగా అహర్నిశలు ఉపాధ్యాయుల సహకారంతో ఆదర్శ పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దారు మంగళవారము బదిలీపై వెళుతున్న కారణంగా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రామాంజులు నాయుడు తిరుపతి పార్లమెంటు రైతు అధ్యక్షులు కనపర్తి గోపీనాథ్ రెడ్డి మోడల్ స్కూల్ కాలేజ్ కమిటీ చైర్మన్ అవసరం సురేష్ రెడ్డి జనసేన అధ్యక్షులు థామస్ బిజెపి అధ్యక్షులు బాబు రాయపేడు సర్పంచ్ బాలాజీ సీనియర్ నాయకులు శివరావు నాగరాజు రెడ్డి మాజీ మోడల్ స్కూల్ చైర్మన్ బాబు కమిటీ మెంబర్లు వెంకటేష్ రంగనాథ సుధా కాటయ్య బూతు కిఇంచార్జ్ లు మనోహర్ బాబ్జి రమేష్ యాదవ్ బాలయ్య ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ఆత్మీయ సన్మానం చేశారు

# సూపర్ సిక్స్ అని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్న టిడిపి ప్రభుత్వం, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ వీరీ చలపతిరావు..



కొడవలూరు, స్వర్ణ సాగరం జూన్ 17:

మండలంలోని నార్త్ రాజుపాలెంలోని ఆయన నివాసంలో నియోజకవర్గ వైసిపి నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు ప్రభుత్వ వైఫల్యాలపై జూన్ 4వ తేదీన వెన్నుపోటు దినం నిర్వహించడం జరిగిందన్నారు. దీనికి విశేష స్పందన వచ్చిందని అన్నారు. అనంతరం తమ నాయకుడైన నల్లపరెడ్డి ప్రశ్నకుమారెడ్డి పై పెయిడ్ ఆర్టిస్టులతో పాటు, జోకర్లతో , కనీసం సర్పంచులుగా గెలవని వారితో ఇష్టానుసారంగా అభివృద్ధి సంక్షేమాలను వదిలేసి మాట్లాడటం సరి కాదన్నారు. కోవూరు నియోజకవర్గంలో అవినీతి అక్రమాలకు స్థానం లేదని స్థానిక ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి నేను చెబుతూనే ఉన్నా అంటున్నారు. గ్రావెల్ ,ఇసుక, లిక్కర్, గంజాయి మాఫియాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి అన్నారు. ఒక పింఛను తప్ప మిగతావి ఏ హామీలు నెరవేర్చలేదన్నారు. రాజుపాలెంలో స్థానిక నాయకులు వి పి ఆర్ ఫౌండేషన్ ద్వారా తెచ్చినవి రూపాయి అయినా ఖర్చు పెట్టారా, పెట్టుంటే ప్రజలకు అందయో లేదో తెలుసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో. నియోజకవర్గ వైసిపి నాయకు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నడి రోడ్డు పై బర్త్ డే సెలబ్రేషన్స్ జరుపుకుని ప్రజలకి ఇబ్బందులు కలిగిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవు





## డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్

కనిగిరి స్వర్ణ సాగరం జూన్ 17

ఇటీవల కనిగిరి లో అర్ధ రాత్రి నడిరోడ్డు పై బర్త్ డే సెలబ్రేషన్స్ జరుపుకుని సామాన్య ప్రజలకి రాత్రి పూట ఇబ్బంది కలిగించిన మైనర్ల కు,వారికి సహకరించిన ఫ్రెండ్స్ కు కనిగిరి డి.ఎస్.పి సాయి ఈశ్వర్ యశ్వంత్ కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది.సామాన్య ప్రజలకి ఇబ్బందులు కలిగించే ఇలాంటి బర్త్ డే పార్టీ లు, వేడుకలు తమ ఇంటిలో జరుపుకోవాలే తప్ప రోడ్డు పై లేదా వీధులలో జరుపుకుంటే కఠినమైన చర్యలు తీసుకుంటామని డి.ఎస్.పి సాయి ఈశ్వర్ యశ్వంత్ సూచించారు.

# యోగాంధ్రపై నేతల ఉన్నత స్థాయి సమీక్ష

కనిగిరి స్వర్ణ సాగరం జూన్ 17



అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని ఈ నెల 21 న విశాఖపట్నంలో నిర్వహించనున్న యోగంధ్ర కార్యక్రమం పై వీ ఎం ఆర్డియే కార్యక్రమంలో మంగళవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించ్చారు. విశాఖపట్నం ఈస్ట్ ఇంచార్జి కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహ రెడ్డి,హెూం మంత్రి వంగలపూడి అనిత, ఎంపీ భరత్ తదితర ప్రజా ప్రతినిధులతో పాటు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా రామలింగేశ్వరుని ధ్వజారోహణ...





విడవలూరు, స్వర్ణ సాగరం జూన్ 17 :

మండలంలోని రామతీర్థం గ్రామంలో వెలసియున్న శ్రీ రామలింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధ వారం ధ్వజారోహణ కార్యక్ర మాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలకు స్వాగతం పలుకుతూ ఆలయం ముందు ఉన్న ధ్వజానికి కొడి ముద్ద పెట్టి దేవతలకు ఆహ్వానం పలికారు. అనంతరం స్వామి అమ్మవార్లను పల్లకి సేవలోంచి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేపట్టారు. ధ్వజా రోహణ కార్యక్రమం అనంతరం భక్తులకు కొడి ముద్దలను అందజేశారు. స్వామివారి కొడి ముద్దుల ప్రసాదం కోసం భక్తులు బారులు తీరారు. ఈ కార్యక్రమానికి బెజవాడ నరేష్ చంద్రారెడ్డి, ప్రత్యూషమ్మ ఉభయకర్తలుగా వ్యవహరించగా టిడిపి ఇన్చార్జి శ్రీధర్ రెడ్డి నాయకులు ఆవుల వాసు, వంశీకృష్ణ రెడ్డి, చైర్మన్ సురేష్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

# స్మార్ట్ మీటర్ల బిగింపును రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలి



చిత్తూరు,స్వర్ణసాగరం,జూన్17

అదానీ స్మార్ట్ మీటర్లు ను బిగించు కోవాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన నిర్ణయాన్ని రద్దు చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ.. ఈ రోజు సాయంత్రం 7 గంటల కు గాంధీ విగ్రహం వద్ద విద్యుత్ వినియోగాదారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు కలసి క్యాండిల్ ల తో నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి చైతన్య, ఉపాధ్యక్షులు శ్రీనివాసమూర్తి, సంతపెట సాకత్, కార్యదర్సులు మునస్వామి, రషీద్, సురేంద్రనాథ్, రోజా,కోమల, విజయగౌరి, రవి, విజయభాస్కర్ తిరువన్నకరసు తదితరులు పాల్గొన్నారు. చైతన్య, సాకత్, మునస్వామి, శ్రీనివాసమూర్తి, సురేంద్రనాథ్ లు మాట్లాడు తూ కేంద్రప్రభుత్వ ఆదేశాల మేరకు కార్పొరేట్ కంపెనీ అదానీకి లబ్ది చేకూర్చడానికి మన రాష్ట్రము లో ఇంటి ఇంటికి అదానీ స్మార్ట్ బిగింపు చేయాలని టీడీపీ కూటమి ప్రభుత్వం చేసిన నిర్ణయాన్ని ఉపసంహరించు కొని వినియోగదారుల పై భారాలు పడకుండా చూడాలని డిమాడ్ చేశారు. ఇప్పటికే షాపులకు, ఫ్యాక్టరీ లకు బిగించిన అదానీ స్మార్ట్ మీటర్ బిల్లులు చూచి వినియోగదారులు అల్లాడి పోతునారని బిల్లుల మొత్తాన్ని చెల్లించలేక నానా అవస్థలు పడుతున్నారని వీరు ఆవేదన వెలిబుచ్చారు. టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే విద్యుత్ భారాలు ఉండవని ఎన్నికలప్పుడు హామీలు ఇచ్చి ఇప్పుడు భారలు వేయడం సరికాదని చెప్పారు. గత ప్రభుత్వం లో స్మార్ట్ మీటర్లు ను వ్యతిరేకించిన టీడీపీ నాయకులు గమనం లోకి తీసుకోవాలని కోరారు.

# కొసరు ఫలాలకు సంబరాలా?

## చంద్రబాబు అంటేనే మోసం

**పెళ్లకూరు స్వర్ణసాగరం జూన్ 17.**

ఏడాది కూటమిపాలనలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి అరా కొరగా అందించిన కొసరు ఫలాల కోసం కూటమినేతలంతా సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, డి సి సి బి మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఘాటుగా విమర్శించారు. మంగళవారం చిల్లకూరు గ్రామంలోని ఆయన నివాసంలో స్థానిక నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సూపర్ సిక్స్ అంటూ అబద్ధాలు చెప్పి అందలం ఎక్కిన కూటమినేతలు ఒక్క పథకాన్ని కూడా సక్రమంగా నిర్వర్తించకుండా డైవర్షన్ పాలిటిక్స్ కొనసాగిస్తూ ప్రజలను దారి మళ్ళిస్తున్నట్లు ఆరోపించారు. రెడ్ బుక్ పాలనను కొనసాగించి కక్షపూరిత రాజకీయాలు చేస్తూ వైకాపా శ్రేణులను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే కాలం ఒకలా ఉండదని వడ్డీతో సహా తిరిగి చెల్లించే రోజు దగ్గర్లోనే ఉందన్నారు. ఇచ్చిన హామీలను ఎలాగో నెరవేర్చని కూటమి నేతలంతా రాష్ట్రంలో ఉన్న సెంట్రల్ జైళ్లను అభివృద్ధి చేసుకోవాలని పాపం చేస్తున్న కూటమినేతలకంతా గమ్యస్థానం అక్కడేనని ఎద్దేవా చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తానంటూ డిప్యూటీ సీఎం గా పదవిని అలంకరించిన పవన్ కళ్యాణ్ ప్యాకేజీ స్టార్ గా మిగిలిపోయాడని ఘాటుగా విమర్శించారు. ఉచిత బస్సు తుస్సు మనిపించి మహిళలను మోసం చేసిన ఘనుడు చంద్రబాబు అని వెల్లడించారు. ఏడాదికి మూడు సిలిండర్ల పేరుతో కాకి లెక్కలు చెప్పి కథ ముగించేసిన కూటమినేతలకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.





తల్లికి వందనం పేరుతో పిల్లలందరికీ తల్లుల ఖాతాలో నగదు జమ చేస్తామని చెప్పి కనీసం 30 శాతం మందికి కూడా న్యాయం చేయలేని దౌర్భాగ్య స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు.

### ప్రకృతి సంపదను దోచేయడమే కూటమి పాలనుకు నిదర్శనం.....

రైతులకు, ప్రజలకు సాగు తాగునీటికి జీవనాధారమైన స్వర్ణముఖి నదిలో యంత్రాలతో ఇసుక త్రవ్వకాలు చేపట్టి యదేచ్ఛగా పరిశ్రమలకు అక్రమంగా తరలించడంలో మండల స్థాయి అధికారులంతా టిడిపి నాయకులకు అండగా నిలవడం సిగ్గుచేటు అన్నారు. సుపరిపాలన చేస్తున్నాం... కోట్ల నిధులు తీసుకొచ్చి నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడుపుతున్నాం అంటూ ప్రగల్భాలు పలికే నాయకులందరూ కొండలు, గుట్టలు, వాగులు, వంకలు, చెరువులు, నదులు యంత్రాలతో తవ్వేస్తూ ప్రకృతి సంపదను దోచేయడమేనా అనే ప్రశ్నించారు. బహిరంగంగా ప్రకృతి సంపదను దోచేసుకుంటూ ప్రజల్లోకి వెళ్లి నీతులు వల్లించడం అందరూ గ్రహిస్తున్నారని వివరించారు. ఓటర్లంతా చాలా తెలివైన వారిని త్వరలోనే తిరిగి ఇచ్చేస్తారని పేర్కొన్నారు. అనంతరం జగన్ అంటే నమ్మకం అని, చంద్రబాబు అంటే మోసం అని పుస్తకాన్ని ఆవిష్కరించి నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శేఖర్ రెడ్డి, ఎంపీటీసీ కుమారస్వామి, సర్పంచ్ చెంచు బాబు, నాయకులు వెంకటరత్నం, బాలసుబ్రమణ్యం, మోహన్, కృష్ణయ్య, ముని కృష్ణయ్య, చక్రపాణి, అశోక్, వీర కుమార్, చిరంజీవి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## మహాలక్ష్మి పురం లో క్రికెట్ ఫైనల్ మ్యాచ్





### నగదు బహుమతులు అందజేత

**తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం జూన్ 17**

మండలంలోని మహాలక్ష్మి పురంలో ప్రీమియర్ లీగ్ సీజన్ 2 క్రికెట్ టోర్నమెంట్ గత 20 రోజుల నుండి 6 టీమ్ లు లీగ్ పద్ధతిలో మ్యాచ్ లు ఆడడం జరిగింది.వీటిలో జయ సూపర్ జెయింట్స్ మరియు శ్రీను స్ట్రైకర్ టీమ్ లు ఫైనల్ మ్యాచ్ ఆడడం జరిగింది..మొదట బ్యాటింగ్ చేసిన శ్రీను స్ట్రైకర్ టీమ్ 10 ఓవర్లో 85 పరుగులు చేసింది అనంతరం బ్యాటింగ్ కి వచ్చిన జయ సూపర్ జెయింట్స్ 9 ఓవర్ లలో 72 పరుగులు చేసి ఓటమి చెందింది ..విజయం పొందిన టీం కి మొదటి బహుమతి శ్రీ ఆదురు గోపాల్ గారు 25000 నగదు బహుమతి ఇవ్వడం జరిగింది ...అలాగే రెండోవ బహుమతిగా రావూరు సుధీర్ రెడ్డి గారు 15000 నగదు బహుమతి ఇవ్వడం జరిగింది..ఈ కార్యక్రమంలో ఆదురు ప్రసన్న ..మరియు కైలాసం రాజా . ఉటుకూరు అవినాష్ . విజయ్ .చింత సుమన్ ఉటుకూరు దేవ పాల్గొన్నారు.

## పాలిస్తీనా - ఇరాన్ పైన ఇజ్రాయిల్ మారణకాండ దాడి ఆపాలి

### ఇజ్రాయిల్ - భారత ప్రభుత్వం వైఖరిని నిరసిస్తూ రేణిగుంట వామపక్షాలు - లౌకిక పరిరక్షణ వేదిక నిరసన ధర్నా

**రేణిగుంట స్వర్ణ సాగరం జూన్ 17**

పాలిస్తీనా – ఇరాన్ పైన ఇజ్రాయిల్ ప్రభుత్వం చేస్తున్న మారణకాండ దాడి ఆపాలని ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధానికి భారత సైనిక సహకార ఒప్పందం చేసుకోవడం దుర్మార్గమని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీని విమర్శించారు. ఇది భారత అలీన విధానానికి విరుద్ధమైనదని రేణిగుంట సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు ఓ.వెంకటరమణ అన్నారు. జూన్ 17న పాలిస్తీనా సంఘీభావ దినం సందర్భంగా వామపక్ష పార్టీలు రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా పాలిస్తీనా – ఇరాన్ పైన ఇజ్రాయిల్ ప్రభుత్వం చేస్తున్న మారణకాండ దాడిని ఖండిస్తూ మంగళవారం ఉదయం 11 గంటలకు రేణిగుంట అంబేద్కర్ విగ్రహం వద్ద లౌకిక పరిరక్షణ వేదిక – సిపిఎం పార్టీ – సిపిఐ పార్టీ కలిసి నిరసన ధర్నా చేపట్టడం జరిగింది. యుద్ధ ఉన్మాదం వద్దు.. నరమేధం వద్దు.. ప్రపంచశాంతి నెలకొల్పాలని రేణిగుంట లౌకిక పరిరక్షణ వేదిక మరియు ఆవాజ్ సంఘం సమన్వయ కమిటీ కన్వీనర్ ఎస్.షా నవాజ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ నాయకులు తులసిరాజన్, సిపిఎం పార్టీ ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్ మాట్లాడుతూ ఇజ్రాయిల్ ప్రభుత్వం చేస్తున్న యుద్ధ ఉన్మాదం దాడిలో పాలిస్తీనా ప్రజలు గడచిన 20 నెలలు లో 63,617 చనిపోయారని, అదేవిధంగా తన సొంత ఇండ్లు ఆస్తిని వదిలి ప్రాణాలు కాపాడుకోవడానికి శరణార్థులుగా మిగిలిన వారు కోటి తొమ్మిది లక్షల మంది ఉన్నారని ప్రస్తుతం ఇరాన్ దేశం పైన ఆధిపత్యం చలాయించడం కోసం ఇరాన్ పైన ఇజ్రాయిల్ ప్రభుత్వం యుద్ధానికి దిగిందని భారత ప్రధాని నరేంద్ర మోడీ ఇజ్రాయిల్ ప్రభుత్వం తో తెగ తెంపులు తెంచుకొని బయటికి రాకపోవడం కాకుండా ఇజ్రాయిల్ యుద్ధ ఉన్మాద దాడికి భారతదేశ సైనిక బలగాలను సహకార ఒప్పందం నుండి విరమించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. ఈ కార్యక్రమంలో లౌకిక పరిరక్షణ వేదిక మరియు



ఆవాజ్ సంఘం సమన్వయ కన్వీనర్ ఎస్. షానవాజ్, మహమ్మద్ వల్లి, కరీముల్లా, భాష, నిజాముద్దీన్, దిలీప్ భాషా, ఆశ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు జూలియన్ రాజు, సిపిఐ పార్టీ నాయకులు తులసిరాజన్, సిపిఎం పార్టీ రేణిగుంట కార్యదర్శి ఈశ్వరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు మరియు ఐద్వా మండల కార్యదర్శి రాజేశ్వరి, రాజశేఖర్, సెల్వరాజ్, కృష్ణ, సుజాతమ్మ, దీప, భారతి, పద్మ, వెంకటరమణ, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు నాటు కోళ్ల పెంపకం మరియు మునగ చెట్లు పెంపకం పై అవగాహన



**స్వర్ణసాగరం తవణంపల్లి జూన్-17**

తవణంపల్లె మండల కేంద్రం శ్రీ శక్తి మండల మహిళ సమైక్య కార్యాలయంలో రైతులకు నాటు కోళ్ల పెంపకం మరియు మునగ చెట్ల పెంపకం పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంగళవారం తవణంపల్లి మండల వెటర్నరీ డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ప్రస్తుతం అనారోగ్య కారణంగా ఉన్న బ్రాయిలర్, లేయర్ లింగాపురం కోడి మాంసం కన్నా నాటు కోళ్ల పెంచి వాటిని తినడం ద్వారా మంచి ఆరోగ్యంగా ఉంటుంది. అని పశువర్ధక శాఖ డాక్టర్ శ్రీధర్ అన్నారు ఒక కేజీ బరువు ఉన్న పక్షులు 6o4=10 ఆరు కోళ్ల డెవలపర్ ఫీడ్ 25 కేజీలు మెడికల్ కిట్ ట్రాన్స్పోర్ట్ తో కలిపి ఒక యూనిట్ ధర రూ 5000 వేలు మండలి సమైక్య కార్యాలయం లేదా ఎఫ్.పి.ఓ. కార్యాలయంలో చెల్లించి తీసుకోవాలని ప్రేమ్ లవ్లీ హుడ్ డి.పి.ఎం. యు ఏ.పీ.ఎం. రవి తెలిపారు అదే విధంగా ఎం.జి.ఎం.ఆర్. ఈ.జి.ఎస్. ద్వారా మునగ చెట్ల పెంపకం పై కూడా అవగాహన కల్పించారు రైతులు ఎఫ్.బి.ఓ కార్యాలయంలో సంప్రదించి తెలుసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు వి.వో.లు ఏ.డి ఆఫీసర్ డి.ఆర్.డి.ఏ నుండి జీవి రమణ ఏ.పి.ఎం రవి ఏ.పి.ఎం. అరుణ. రూత్ ఎఫ్.టి.ఓ.లు ఫార్మర్స్ సీ.సీ.లు పాల్గొన్నారు.

## రామచంద్రపురం గ్రామంలో మత్స్యకార నాయకులు ఆవుల వాసు చేతుల మీదుగా వాలీబాల్ కోర్ట్ ప్రారంభం..



**విడవలూరు, స్వర్ణ సాగరం జూన్ 17 :**

మండలంలోని రామచంద్రపురం గ్రామంలో మంగళవారం వాలీబాల్ కోర్ట్ ను మచ్చ కరనాయకులు ఆవుల వాసు చేతుల మీదుగా ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి సహకారంతో నేడు రామచంద్రపురం గ్రామంలో వాలీబాల్ కోర్టును ప్రారంభించుకోవడం జరిగిందని అన్నారు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మత్స్యకార గ్రామాల్లో యువత చెడు వ్యసనాలకు బానిసలు అవుతున్నారని మత్స్యకార గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి యువతకు క్రీడా ప్రాంగణాలను తగు ఆట వస్తువులను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రతి యువత క్రీడలు పట్ల ఉత్సాహంగా ఉండి ముందుకు సాగాలన్నారు, ఇలాంటి వారి కోసం తమ ప్రోత్సాహం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాపులు యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆకట్టుకుంటున్న 'భూ అంటూ భూతం'



నితిన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'తమ్ముడు'. శ్రీరామ్ వేణు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జూలై 4న "తమ్ముడు" సినిమా వరల్డ్ వైడ్ గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'భూ అంటూ భూతం..' రిలీజ్ చేశారు. మేనకోడలు బేబి దిత్యకు మేనమామ నితిన్ ధైర్యం చెప్పే సందర్భంలో ఈ పాటను చిత్రీకరించారు. 'భూ అంటూ భూతం..' పాటను అజనీష్ లోకనాథ్ బ్యూటిఫుల్ గా కంపోజ్ చేయగా, అనురాగ్ కులకర్ణి, అక్షిత పోల ఆకట్టుకునేలా పాడారు. సింహాచలం మన్నేలా లిరిక్స్ రాశారు. 'భూ అంటూ భూతం..' పాట ఎలా ఉందో చూస్తే – 'భూ అంటూ భూతం వస్తే ఆగకే అమ్మాడీ, ఛూ మంత్రం వేసి దాంతో బొమ్మలాటలాడాలి. భూ అంటూ భూతం వస్తే ఆగకే అమ్మాడీ, ఛూ మంత్రం వేసి దాంతో బొమ్మలాటలాడాలి..పుట్టగానే నేరుగా నువు పరుగెత్తలే, పట్టుకుంటూ పడుతూ నడకేనేర్చావే, భయపడి అడుగు ఆపకే..అంటూ సాగుతుందీ పాట.



# ప్యారడైజ్ లక్ష్యానికి అనుకోని బ్రేకులు

న్యాచురల్ స్టార్ నాని కెరీర్ లోనే అతి పెద్ద ప్యాన్ ఇండియా మూవీగా రూపొందుతున్న ది ప్యారడైజ్ ముందు లాక్ చేసుకున్న విడుదల తేదీ మార్చ్ 26. ఒక రోజు గ్యాప్ తో రామ్ చరణ్ పెద్ది వస్తున్నా సరే వెనక్కు తగ్గకూడదని తొలుత నిర్ణయించుకున్నారు. కానీ తాజా పరిణామాలు ప్యారడైజ్ కు బ్రేక్స్ లా మారుతున్నాయని ఇన్ సైడ్ టాక్. ఇప్పటికే కొంత భాగం షూటింగ్ జరిగినప్పటికీ ఇంకొందరు కీలక ఆర్టిస్టుల డేట్లు అందుబాటులో లేకపోవడంతో పాటు సెట్ వర్క్ మరింత మెరుగు పరచాలనే ఉద్దేశంతో చిన్నవిరామం ఇచ్చారని, తిరిగి జూలై లేదా ఆగస్ట్ లో పునఃప్రారంభమవుతుందని అంతర్గత సమాచారం.ఒకవేళ ఇది నిజమైతే ప్యారడైజ్ మార్చ్ లో రావడం కష్టం. వేసవికి వెళ్లిపోవాల్సి ఉంటుంది. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల వేగంగా తీయడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ పరిస్థితులు దానికి సహకరించడం లేదని వినికిడి. నాని కూడా ఎలాంటి కమిట్ మెంట్స్ లేకుండా పూర్తిగా దీనికే అంకితమవుతున్నాడు. బయట ప్రచారం జరుగుతున్నట్టు ఇంకా ఓటిటి డీల్ కాలేదని తెలిసింది. నెట్ ఫ్లిక్స్ రెడీగా ఉన్నా రేట్ విషయంలో కంక్లూజన్ కు రాలేదని అంటున్నారు. చాలా ముఖ్యమైన పాత్రకు మోహన్ బాబుని తీసుకున్నారనే వార్త కూడా అధికారిక ధృవీకరణ దక్కించుకోలేదు. నెలల తరబడి ఇది గాసిప్ గానే ఫిలిం నగర్ వర్గాల్లో తిరుగుతోంది. ఒకరకంగా చెప్పాలంటే భారీ పొటెన్షియల్ ఉన్న పెద్ది, ది ప్యారడైజ్ లు క్లాష్ లేకుండా సోలోగా రావడమే మంచిది. ఒకపక్క పెద్దిని దర్శకుడు బుచ్చిబాబు పరుగులు పెట్టిస్తున్నారు. ఇంకా చాలా టైం ఉన్నప్పటికీ పోస్ట్ ప్రొడక్షన్, ప్రమోషన్లకు ఎక్కువ సమయం దొరికేలా చూసుకుంటున్నారు. హైప్ పరంగా చూస్తే దీని మీద విపరీతమైన బజ్ వచ్చేసింది.



# ఈ సినిమాకు వెబ్ సిరీస్ ఎందుకు?

ఎంత పెద్ద బడ్జెట్ తో తీసినా ఎంత క్రేజీ క్యాస్టింగ్ ఉన్నా కంటెంట్ బాలేకపోతే ప్రేక్షకులు నిర్మొహమాటంగా మొదటి షోకే తిరస్కరించే రోజులివి. తెరవెనుక 24 క్రాఫ్ట్స్ ఎంత కష్టపడ్డారనేది ఆడియన్స్ కి అనవసరం. తన టికెట్ డబ్బుకు, సమయానికి న్యాయం చేశారా లేదా అనేది మాత్రమే చూసుకుంటాడు. ఉద్దేశపూర్వకంగా ఏదైనా సినిమాని చంపడం సోషల్ మీడియా జమానాలో అయ్యే పని కాదు. కానీ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ మాత్రం ఈ వాస్తవాన్ని అంగీకరించేందుకు ఇష్టపడటం లేదు. సూర్యతో తీసిన రెట్రో మంచి చిత్రమని, థియేటర్లకు వెళ్ళినప్పుడు ఆడియన్స్ తనకు చెప్పారని మళ్ళీ అదే క్యాసెట్ వినిపిస్తున్నారు.రెట్రోని 40 నుంచి 50 నిమిషాల వరకు ఒక్కో ఎపిసోడ్ కి నిడివి పెట్టి వెబ్ సిరీస్ లా రిలీజ్ చేసే ఆలోచన ఉందని, కానీ నెట్ ఫ్లిక్స్ నుంచి అంత సానుకూల స్పందన రాలేదని చెప్పుకొచ్చారు. కొందరు ఉద్దేశపూర్వకంగా డబ్బులు ఖర్చు పెట్టి సినిమాలను నెగటివ్ చేస్తున్నారని, అలాంటి వాళ్లకు రెట్రో బలైపోయిందని అన్నారు. అసలు ఎవరి ప్రభావం లేని సామాన్య ప్రేక్షకులు, అభిమానులకు సైతం రెట్రో నచ్చలేదు. కలెక్షన్లలోనూ అది బయట పడింది. నిజంగా కథలో దమ్ముంటే ఎవరూ ఎవరిని ఆపలేరని చాలా సినిమాలు ఋజువు చేశాయి. కానీ కార్తీక్ సుబ్బరాజ్ ఇవన్నీ ఒప్పుకోవడానికి ససేమిరా అంటున్నారు. ఇప్పుడు చేసిన పొరపాట్లు ఏవో గుర్తిస్తే భవిష్యత్తు అవి రిపీట్ కాకుండా చూసుకోవచ్చు. అలా కాకుండా నేనో క్లాసిక్ తీశాను, కావాలని చంపేశారు అంటే ఎవరూ సానుభూతి చూపరు. కంగువ టైంలోనూ సూర్య భార్య జ్యోతిక ఇదే తరహాలో బాగున్న సినిమాని కిల్ చేశారని, ఎంత కష్టపడి తీశారో మీకు తెలుసా అంటూ సీరియస్ గానే నిలదీశారు.

# బాహుబలిలో తమన్నాకి డూప్‌గా బిగ్ బాస్ భామ.. వద్దన్నా కూడా!

ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో రూపొందిన క్రేజీ ప్రాజెక్ట్ బాహుబలి ఎంత పెద్ద విజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ప్రభాస్, రానా, తమన్నా, అనుష్క, నాజర్ ప్రధాన పాత్రలలో ఈ చిత్రం రూపొందింది. ఈ చిత్రం తెలుగు సినిమా ఖ్యాతిని పెంచింది. అనేక రికార్డులు తిరగరాసింది. రెండు పార్ట్‌లుగా రూపొందిన ఈ చిత్రం హాలీవుడ్ ప్రముఖులని సైతం ఆశ్చర్యపరిచింది. అయితే ఈ చిత్రంలో తమన్నాకి డూప్‌గా బిగ్ బాస్ భామ భాను శ్రీ నటించిందట. ఈ విషయాన్ని తాజా ఇంటర్వ్యూలో తెలియజేసింది భాను. బాహుబలి సినిమాలో తమన్నా ఫ్రెండ్స్ లో ఒక క్యారెక్టర్ చేసిన భాను శ్రీ తమన్నా డూప్‌గా కూడా చేసినట్టు పేర్కొంది. నేను డ్యాన్సర్ గా చేస్తున్నప్పుడు తమన్నాకు డూప్ గా చేయమని ఆఫర్ ఇచ్చారు. అయితే అది బాహుబలి సినిమా అని నాకు తెలీదు. మొదట చేయను అని చెప్పాను. ఆ తర్వాత వాళ్ళు రెమ్యునరేషన్ బాగా పెంచడంతో ఓకే చెప్పాను. సెట్ కి వెళ్ళాక అది బాహుబలి సినిమా అని తెలిసింది. 17 రోజులు తమన్నాకు డూప్ గా నటించాను. ఆ తర్వాత నా యాటిట్యూడ్, యాక్టింగ్ చూసి తమన్నా ఫ్రెండ్ క్యారెక్టర్ కి తీసుకున్నారని పేర్కొంది భాను శ్రీ. ఈ అమ్మడు బిగ్ బాస్ తర్వాత ఢీ షోలో మెంటర్ గా చేసింది కానీ కొన్ని ఎపిసోడ్స్ తర్వాత మధ్యలోనే వెళ్ళిపోయింది.అందుకు గల కారణం కూడా తాజా ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. బిగ్ బాస్ తర్వాత ఢీ ఆఫర్ వస్తే బిగ్ బాస్ టీమ్ కి చెప్పే ఆ షో చేశాను. కానీ అయిదు ఎపిసోడ్స్ పూర్తి అయిన తర్వాత నాకు ఫోన్ చేసి మీరు ఆ షో చేయొద్దు అన్నారు. నేను మీకు చెప్పినప్పుడు ఒకే అన్నారు కదా, అందుకే చేస్తున్నాను అని చెప్పాను. అయితే మా రీజన్స్ మాకు ఉన్నాయి. అగ్రిమెంట్ లో మీరు వేరే ఛానల్ షోలు చేయొద్దు అని ఉంది కదా అన్నారు. దాంతో మధ్యలో వెళ్ళిపోయా. నేను డ్యాన్సర్ గా కెరీర్ మొదలుపెట్టి ఢీలో ఒక డ్యాన్స్ టీమ్ కి మెంబర్ అంటే చాలా సంతోషంగా ఫీల్ అయ్యాను. కాని మధ్యలోనే వెళ్లిపోవాల్సి రావడం చాలా బాధ కలిగించిందని భాను శ్రీ ఇంటర్వ్యూలో పేర్కొంది.

